మన
నేషనలిస్ట్ వాయిస్
తెలుగు దిన పత్రిక
RNI : TGTEL/25/A4284
www.mananationalistvoice.com
epaper.mananationalistvoice.com

రిపోర్టర్లు కావలెను
మన నేషనలిస్ట్ వాయిస్ తెలుగు దిన పత్రిక
తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.
తెలుగు రాష్ట్రాలలో సంచనాలు సృష్టిస్తున్న నేషనలిస్ట్ వాయిస్ మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పిస్తోంది. రిపోర్టర్లు కావాలి.
ఇంకెందుకు ఆలస్యం...
9666023180.8096660656 నంబర్లకు

ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 176 | 24 ఆదివారం, మే 2026 | పేజీలు :12 | వెల: రూ. 3/-
హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి, ఆదిలాబాద్, మెదక్, నల్గొండ, మహబూబ్ నగర్, ఖమ్మం, విజయవాడ, గుంటూరు, అమరావతి, క్రిష్ట, గోదావరి, కర్నూలు, చిత్తూరు, కడప, ప్రకాశం, శ్రీకాకుళం



**నేషనలిస్ట్ వాయిస్ యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో మే 23**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శనివారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రూ, 99.55 కోట్లతో యాదగిరిగుట్ట ఆలయ అనుబంధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

వివరాలు 2లో

# వందకోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర
- సరస్వతి స్వామి ఆధ్వర్యంలో వైభవంగా భూమిపూజ
- సాంప్రదాయ దుస్తుల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి
- వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ నిర్వహించిన వేద పాఠశాల భూమిపూజ
- యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి క్షేత్రంలో వేద పాఠశాల భూమిపూజ కార్యక్రమం
- కంచికామకోటి పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి స్వామితో కలిసి భూమిపూజలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

# ప్రధాని మోడీతో రామ్మోహన్ కుటుంబం భేటీ

## జీవితాంతం గుర్తిండి పోయే మధుర క్షణం అంటూ పోస్ట్



**న్యూఢిల్లీ,మే24నేషనలిస్ట్ వాయిస్**

కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం కుటుంబంతో కలిసి ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి తల్లి ప్రధాన మంత్రికి మొక్కను బహుకరించారు. కుటుంబంతో కలిసి ప్రధాని మోదీని కలవటంపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఎక్స్‌లో ఓ భావోద్వేగ పోస్ట్ పెట్టారు. ఆ పోస్టులో.. 'ఈ రోజు మా కుటుంబానికి జీవితాంతం గుర్తుండిపోయే ఓ భావోద్వేగ క్షణం. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కుటుంబ సమేతంగా కలిసే అదృష్టం కలగడం ఎంతో ఆనందంగా, గర్వంగా భావిస్తున్నాను'.. ఆయన అసాధారణ వ్యక్తిత్వం, ఆప్యాయత మా కుటుంబంలోని మూడు తరాలను ఒకేలా ఆకట్టుకుంది.

వివరాలు 2లో

## గోదావరి పుష్కరాలకు

# వేయికోట్లు

- జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం
- గంగాధర కాలేజీలో పోస్టుల భర్తీకి ఆమోదం
- కేసముద్రం ఫైర్‌స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరు
- తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం



**హైదరాబాద్,మే24నేషనలిస్ట్ వాయిస్**

వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నేపథ్యంలో.. సంబంధిత పనులకు రూ.వెయ్యి కోట్ల కేటాయిస్తూ తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తొలి విడతగా రూ.300 కోట్ల మంజూరుకు పచ్చజెండా ఊపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ భేటీలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అల్పాహారం, పాలు అందించాలని నిర్ణయించింది.

వివరాలు 2లో

# హరీష్ రావువి పగటి కలలు

- అధికారంలోకి రావడం
- కల్ల ఫ్యూచటర్ సిటీపై బాధ్యాతారాహిత్య ప్రకటన
- అభివృద్దిని అడ్డుకోవడమే లక్ష్యంగా బిఆర్ఎస్
- మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్,మే24నేషనలిస్ట్ వాయిస్**

ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నారని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. ఇది బ్లాక్ మెయిల్ రాజకీయమని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలా? వద్దా? ఆయన చెప్పాలన్నారు. 'ఇలా చేస్తే పెట్టుబడులు రావు. పక్క రాష్ట్రాలకు వెళ్తాయి. ఫ్యూచర్ సిటీలో కాలుష్యకారక పరిశ్రమలు ఉండవు. దాన్ని రద్దు చేస్తామనడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని బీఆర్ఎస్ అడ్డుకుంటోందని మంత్రి ఆరోపించారు. ఆ పార్టీ బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలకు యత్నిస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటిరోజు నుంచే బీఆర్ఎస్ నేతలు విమర్శలే ప్రధాన అంశంగా ముందు కెళ్తున్నారని తెలిపారు. జంట నగరాలకు సంబంధించిన మెట్రోను విస్తరించాలనుకుంటే అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ పార్టీ నేతలపై మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు చీప్ పాలిటిక్స్.. బ్లాక్ మెయిల్ పాలిటిక్స్ చేయొద్దని అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎక్కడ అభివృద్ధి చేస్తే అక్కడ ఆపుతామంటే ఎలా అని ప్రశ్నించారు.




## రెండోవిడతలో రెండున్నర లక్షల

# ఇందిరమ్మ ఇళ్లు

- ప్రతి నియోజకవర్గానికి 2 వేల చొప్పన మంజూరు
- పాత ఇందిరమ్మ ఇల్లల పూర్తికి నిధులు కేటాయింపు
- జూన్ 1న కొరాటి గ్రామంలో ఆదివాసీల ఇందిరమ్మ కాలనీ ప్రారంభం
- కేబినేట్ నిర్ణయాలను వివరించిన మంత్రి పొంగులేటి

02

# అమెరికాకు భారత్ కీలక భాగస్వామి

- భద్రత, వాణిజ్య,సాంకేతిక రంగాల్లో సహకారం
- ప్రధాని మోడీతో అమెరికా విదేశాంగ మంత్రి రూబియో చర్చలు



**న్యూఢిల్లీ,మే24నేషనలిస్ట్ వాయిస్:**

భద్రత, వాణిజ్యం, సాంకేతిక రంగాలలో అమెరికా-భారత్ సహకారాన్ని మరింతగా పెంపొందించే మార్గాలపై ప్రధాని మోదీతో చర్చించినట్లు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్కొన్నారు.

వివరాలు 2లో

# ప్రజల ఆరోగ్యం ప్రభుత్వం బాధ్యత

- ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి
- ఆరోగ్యమే మనకు అసలు సిసిలు సంపద
- యోగా, ధ్యానం, ప్రాణాయామం జీవితంలో భాగం కావాలి
- ఆగస్టు 15 నాటికి రాష్ట్రమంతటా సంజీవని



కండ్రిగలో నిర్వహించిన 'సంజీవని' కార్యక్రమంలో చంద్రబాబు

02

# రైతులకు ఆధునిక టెక్నాలజీల ను అందించాలి

- డిమాండ్ ఉన్న పంటలనే రైతులు సాగు చేయాలి
- వ్యవసాయ వర్సిటీలో విత్తన వారోత్సవాలు ప్రారంభించిన మంత్రి తుమ్మల

02






# యువత ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

- దేశవ్యాప్తంగా రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి ఉద్యోగాలు
- ఇప్పటివరకు 12.5 లక్షల మందికి ఉద్యోగావకాశాలు
- 19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

# రెండోవిడతలో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్,మే24నేషనలిస్ట్ వాయిస్

రాష్ట్రంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం 2 లక్షల 50 వేల మంది పేద కుటుంబాల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రతి నియోజకవర్గానికి 2 వేల చొప్పున ఇళ్లను మంజూరు చేయాలని నిర్ణయించింది. కేబినేట్ వివరాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ కుమార్‌లు మీడియాకు వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించి గోడలు, శ్లాబు దశలో నిలిచిపోయిన వాటిని కూడా పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. పునాదులు పూర్తయి గోడలు, శ్లాబు పడని ఇళ్లకు రూ.3 లక్షలు, గోడలు పూర్తయి శ్లాబు నిలిచిపోయిన ఇళ్లకు రూ.2 లక్షలు చొప్పున అందిస్తాం. అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేసేందుకు నియోజకవర్గానికి 500 ఇళ్లకు చొప్పున నిధులు కేటాయిస్తూ క్యాబినెట్ తీర్మానించింది. తొలి విడతలో నిర్మాణం ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్లలో జూన్ రెండు నాటికి దాదాపు లక్ష ఇళ్ల గృహ ప్రవేశాలు జరుగుతాయి. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కొరారి గ్రామంలో కొలాం ఆదివాసీలకు ప్రభుత్వం కట్టించిన 28 ఇందిరమ్మ ఇళ్లను జూన్ 1వ తేదీన ప్రారంభించాలని నిర్ణయించాం. జూన్ 1వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,రాష్ట్ర మంత్రులంతా అక్కడికి వెళ్లి ఈ కార్యక్రమంలో పాల్గొంటాం అని మంత్రి పొంగులేటి తెలిపారు. హైదరాబాద్ మహానగరం క్యూర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో అల్పాదాయ వర్గాల వారి కోసం లక్ష ఇళ్లు నిర్మించి ఇవ్వాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వివిధ దఫాలుగా చేసిన సర్వేల ప్రకారం 15 వేల కుటుంబాలు గుడిసెల్లో నివాసం ఉంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. వెంటనే ఆ కుటుంబాల న్నింటికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందించాలని రాష్ట్ర క్యాబినెట్ తీర్మానించింది. గుడిసెలు లేని ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణను నిలపాలని క్యాబినెట్ నిర్ణయించింది. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జులై 7వ తేదీ వరకు జరగనున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి వివిధ పనులు చేపట్టేందుకు రూ.1000 కోట్ల నిధులకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో తొలి విడతగా రూ.300 కోట్లు మంజూరుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. విద్యుత్ పంపిణీ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఖీఆఃూలో చేరేందుకు తెలంగాణ డిస్కంలు తయారు చేసిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలోని అన్ని జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రభుత్వం పాఠశాలలతో పాటు అన్ని జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకూ ఉదయం అల్పాహారంతో పాటు పాలు అందించాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని డిసిఎంఎస్‌లను మార్క్ ఫెడ్లో విలీనం చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. తెలంగాణ రూరల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ కార్పొరేషన్ హాకాలో విలీనం చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం భూ సేకరణ, పునరావాసం, మౌలిక వసతుల సదుపాయాల కల్పనకు రూ.587 కోట్లు కేటాయిస్తూ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తెలంగాణను 2030 నాటికి ప్రపంచంలోని టాప్ 5 లైఫ్ సైన్సెస్ హబ్‌లలో ఒకటిగా నిలబెట్టాలన్నది రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం. అందుకే నెక్స్ట్ జనరేషన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-30ని రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. దావోస్‌లో ఈ పాలసీని లాంఛనంగా ఆవిష్కరించాం అని తెపిపారు. ఈ పాలసీ ద్వారా వచ్చే ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాలతో పాటు 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులు ఆకర్షించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నాం. లైఫ్ సైన్సెస్, ఫార్మా, బయోటెక్, మెడికల్ ఇన్నోవేషన్ రంగాల్లో భారీ పెట్టుబడులకు గమ్యస్థానంగా మారుస్తాం. యువతకు పరిశోధన, తయారీ, డిజిటల్ హెల్త్, గ్లోబల్ ఇన్నోవేషన్ రంగాల్లో మంచి అవకాశాలు కల్పిస్తాం. ఇప్పటివరకు ఎక్కువగా తయారీ మీద దృష్టి ఉంటే, ఇక నుంచి విలువైన ఇన్నోవేషన్ మీద ఎక్కువ ఫోకస్ పెడతాం. రీసెర్చ్ అండ్ డెవెలప్మెంట్ యూనిట్లను కూడా పరిశ్రమలుగా గుర్తించే విధంగా ఈ పాలసీలో మార్పు తీసుకొస్తున్నాం. గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు, గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్లు తెలంగాణకు రావడానికి ఈ పాలసీ ఉపయోగపడుతుందని మంత్రులు వివరించారు.

మొదటిపేజీ తరువాయి

# అమెరికాకు భారత్ కీలక భాగస్వామి

తమ దేశానికి భారత్ ఓ కీలక భాగస్వామి అన్నారు. అమెరికా- భారత్ మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలపడుతున్నాయని.. భారతీయ కంపెనీలు తమ దేశంలో 20 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టాయని తెలిపారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు చేరుకున్న మార్కో రూబియో ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. వైట్‌హౌస్‌ను సందర్శించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తరఫున ఆయన మోదీని ఆహ్వానించారు. సేవాతీర్థ్ లో దాదాపు గంటకు పైగా ప్రధానితో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. భారత్‌కు ముడి చమురు సరఫరా చేయడానికి తమ దేశం సిద్ధంగా ఉందన్నారు. అదే సమయంలో ప్రపంచ ఇంధన మార్కెట్‌ను తన ఆధీనంలోకి తీసుకోవడానికి ఇరాన్ చేస్తున్న ప్రయత్నాలను తాము ఎప్పటికీ అంగీకరించబోమన్నారు. ప్రధాని మోదీకి, ట్రంప్‌నకు మధ్య మంచి స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని రూబియో అన్నారు. వారిద్దరూ కేవలం తాత్కాలిక ప్రయోజనాల గురించే కాకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలపైనా దృష్టిపెడతారని పేర్కొన్నారు. ఈ క్రమంలో దేశంలో మండుతున్న ఎండల గురించి మాట్లాడుతూ.. వేడిగా ఉన్నందున తన ప్రసంగాన్ని క్లుప్తంగా ముగించాలనుకుంటున్నానంటూ చమత్కరించారు. అమెరికా విదేశాంగ మంత్రి రూబియోతో భేటీపై ప్రధాని మోదీ స్పందించారు. భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యం పురోగతితోపాటు ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతి భద్రతలు తదితర అంశాలపై చర్చలు జరిపామన్నారు. భవిష్యత్తులో ఇరుదేశాల మధ్య బంధం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ శ్రేయస్సు కోసం అమెరికాతో కలిసి పని చేస్తామన్నారు. ఇరాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతలను పరిష్కరించుకోవడానికి శాంతియుత చర్చలు జరపాలని ఈ సందర్భంగా ప్రధాని సూచించారు.

మొదటిపేజీ తరువాయి

# ప్రజల ఆరోగ్యం ప్రభుత్వం బాధ్యత

చిత్తూరు,మే24నేషనలిస్ట్ వాయిస్

ఆహారమే ఔషధం, వంటశాలే ఔషధ శాల. ఈ మాట నేను ఎప్పుడూ చెబుతాను. మనం తినే ఆహారమే మనకు తిరుగులేని ఆరోగ్యాన్ని అందిస్తుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. శనివారం చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం, యాదమరి మండలం కండ్రిగలో నిర్వహించిన 'సంజీవని' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. తన వరకు తాను పూర్తి ఆహార నియమాలు పాటిస్తానని, మంచి అలవాట్లు, మంచి ఆహారం, వ్యాయామం, మంచి ఆలోచనల ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటివి జీవనశైలిలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సంపద ఉన్నవాళ్లకంటే ఆరోగ్యంగా ఉన్నవాళ్లే అదృష్టవంతులని ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా 'సంజీవని' కార్యక్రమం ప్రాముఖ్యతను సిఎం వివరించారు. 'రామ రావణ యుద్ధంలో లక్ష్మణుడి ప్రాణాలు కాపాడేందుకు హనుమంతుడు సంజీవనిని తీసుకొచ్చారు. అదే స్ఫూర్తితో, డిజిటల్ హెల్త్ రికార్డులతో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ కార్యక్రమానికి 'సంజీవని' అని పేరు పెట్టాం. సంపద కంటే ఆరోగ్యమే గొప్పది. అందుకే ఆరోగ్యమే మహాభాగ్యమని పెద్దలు అన్నారు' అని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రపంచస్థాయి వైద్య సేవలను ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆగస్టు 15 నాటికి రాష్ట్రమంతటా సంజీవని పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరికీ ఒక ఏఐ డాక్టర్ ఉంటారని తెలిపారు. సంజీవని పథకం విస్తరణలో భాగంగా డబ్బు, హోదా, కార్లు ఎన్ని ఉన్నా.. అన్నింటికీ మించింది ఆరోగ్యమేనని గుర్తు చేశారు. సంజీవని పథకం కింద ఇంటి నుంచే 74 రకాల వైద్య పరీక్షలు చేయించుకునే అవకాశముందన్నారు. వ్యాధులు రాకముందే గుర్తించి, నివారించేందుకు ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు తెలిపారు. గత జూలైలో కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించి, మార్చి 15 నుంచి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని 19.75 లక్షల మంది ఆరోగ్యాన్ని కాపాడేలా చర్యలు తీసుకుంటున్నామని, ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తామని ప్రకటించారు. ఈ పథకంలో భాగంగా 42 రకాల వైద్య పరీక్షలను ప్రజల ఇళ్ల వద్దే నిర్వహించి, రిపోర్టులు అందిస్తామన్నారు. డాక్టర్ అపాయింట్‌మెంట్, వర్చువల్ కనెక్ట్ ద్వారా వైద్య సలహాలు, వ్యక్తిగత ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్ వంటి సేవలు అందిస్తున్నట్లు వివరించారు. త్వరలోనే ఏఐ డాక్టర్ ద్వారా కూడా వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి వ్యక్తికి ఒక ఏఐ డాక్టర్ ఉంటాడని స్పష్టం చేశారు. వైద్య ఖర్చుల భారం నుంచి కుటుంబాలను గట్టెక్కించడమే ప్రభుత్వ లక్ష్యమని, విద్య, వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ఏడాది వైద్యరంగానికి రూ.19,305 కోట్లు కేటాయించామని, 15వ ఆర్థిక సంఘం నుంచి దేశంలోనే అత్యధికంగా రూ.2,601 కోట్ల ఆరోగ్య గ్రాంట్లు సాధించామని గుర్తు చేశారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ కింద ప్రతి ఒక్కరికీ రూ.2.5 లక్షల విలువైన వైద్యం, ఎన్టీఆర్ వైద్య సేవ, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.25 లక్షల వరకు ఖర్చులు భరిస్తామని హామీ ఇచ్చారు. ప్రకృతి బాగుంటేనే మనం బాగుంటామని, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సిఎం చంద్రబాబు అన్నారు. సమర్థ నీటి నిర్వహణతో భూగర్భ జలాలను పెంచగలిగామని, దీనికి అన్నమయ్య జిల్లానే నిదర్శనమని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగం చర్యలతో అక్కడ భూగర్భ జలాలు 8.5 మీటర్లు పెరిగి, పచ్చదనం పెరిగిందన్నారు. రాష్ట్రమంతా తీవ్ర ఉష్ణోగ్రతలు ఉంటే, అన్నమయ్య జిల్లాలో ఉష్ణోగ్రతలు తగ్గాయని, పిడుగురాళ్లలో 49 డిగ్రీలు నమోదైతే, అన్నమయ్యలో 40 డిగ్రీలే ఉందని నివేదికలను ఉటంకించారు. సాగునీటి ప్రాజెక్టులపై సంకల్పంతో పనిచేస్తున్నామని, ఏ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తి చేస్తామో క్యాలెండర్ విడుదల చేశామని చంద్రబాబు తెలిపారు. నీవా పనులు పూర్తి చేసి పూతలపట్టు మీదుగా చిత్తూరు వరకు కృష్ణా నీటిని తెస్తామని, కల్యాణి డ్యాంకు కూడా నీళ్లిస్తామని హామీ ఇచ్చారు. గాలేరు-నగరి, మల్లెమడుగు, సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్ వంటి ప్రాజెక్టుల పూర్తికి గడువులను ప్రకటించారు. ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇవ్వడమే తమ లక్ష్యమని, ఆ దిశగా నిరంతరం పనిచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

మొదటిపేజీ తరువాయి

# హరీష్ రావువి పగటి కలలు

ప్రజలు కోరుకున్నది తప్పకుండా చేసి తీరుతామన్నారు. వేలాది కోట్లు పెడతామని మల్టీ నేషనల్ కంపెనీలు వస్తున్నాయని.. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటే పెట్టుబడిదారులు భయపడరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ తెచ్చిన మెట్రోనే ముందుకు సాగిందని మంత్రి తెలిపారు. తాము ఎన్ని కిలోమీటర్లు తెచ్చామో అన్ని కిలోమీటర్లు మాత్రమే మెట్రో వచ్చిందని చెప్పారు. మెట్రోను విస్తరిద్దామంటే అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. పెరిగిన జనాభాకి అనుగుణంగా మెట్రో విస్తరించకూడదా అని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తామని మాజీ మంత్రి హరీశ్ రావు పగటి కలలు కంటున్నారని విమర్శించారు. అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిందని.. అయినా ఆ పార్టీ నేతల బుద్ధి మారడం లేదని వ్యాఖ్యానించారు. నగరాన్ని విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోందని మంత్రి తెలిపారు. ప్రజల అవసరాలను తీర్చడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇతర నగరాల అభివృద్ధిపై అధ్యయనం చేశామన్నారు. రాబోయే తరాలకు ఉపయోగపడే కార్యాచరణ చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడానికే బీఆర్ఎస్ ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని మంత్రి ఆరోపించారు. ఓటమితో ఎదురైన నిరాశ నుంచి ఇప్పటికీ బయటకి రాలేకపోతున్నారన్నారు. బుల్లెట్ ట్రైన్ తెస్తామంటే.. ఎందుకని బీఆర్ఎస్ నేతలు అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు. తెలంగాణ యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వొద్దా అని అన్నారు. స్వార్థ రాజకీయాలే తమకి ముఖ్యమని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు విరుచుకుపట్టారు.

మొదటిపేజీ తరువాయి

# గోదావరి పుష్కరాలకు వేయికోట్లు

అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ సెంటర్ల ఏర్పాటుకు కరీంనగర్ జిల్లాను ఎంపిక చేసింది. కేసముద్రం ఫైర్‌స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరుకు అంగీకారం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ కేబినెట్ శనివారం భేటీ అయ్యింది. రాష్ట్రానికి సంబంధించి పలు అంశాలపై మంత్రిమండలి చర్చించింది. ఈ సందర్భంగా కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేందుకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలల్లోనూ విద్యార్థులకు ఉదయం అల్పాహారం, పాలు అందించాలని మంత్రిమండలి నిర్ణయించింది. 2027 గోదావరి పుష్కరాల పనులకు రూ.1,000 కోట్లు కేటాయిస్తూ తెలంగాణ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. తొలివిడతగా రూ.300 కోట్లు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరోవైపు నిరుద్యోగ యువతకూ మంత్రిమండలి గుడ్ న్యూస్ చెప్పింది. కరీంనగర్ జిల్లా గంగాధరలోని డిగ్రీ కళాశాలలో నియామకాలకు పచ్చజెండా ఊపింది. 20 రెగ్యులర్ టీచింగ్ పోస్టులు, 6 నాన్ టీచింగ్ పోస్టులు, అవుట్ సోర్సింగ్ పద్ధతిన మరో 3 పోస్టుల మంజూరుకు ఆమోదం తెలిపింది. మహబూబాబాద్ జిల్లా కె.సముద్రం అగ్నిమాపక కేంద్రానికి సంబంధించి 18 పోస్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

మొదటిపేజీ తరువాయి

# రైతులకు ఆధునిక టెక్నాలజీల ను అందించాలి

హైదరాబాద్,మే23నేషనలిస్ట్ వాయిస్

భవిష్యత్ వ్యవసాయ రంగంలో కూలీల సమస్య అధికమయ్యే అవకాశం ఉన్నందున డ్రోన్స్ వినియోగం ప్రాముఖ్యతని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గుర్తు చేసారు. తదనుగుణం గా వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన డ్రోన్ ఆధారిత వివిధ వ్యవసాయ విధానాల్ని మంత్రి అభినందించారు. రాజేంద్ర నగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈరోజు పర్యటించారు. తొలుత మంత్రి గత ఏడాది స్థాపించిన సెంటర్ ఫర్ డిజిటల్ అగ్రికల్చర్, టెక్నాలజీ ని సందర్శించి ఆధునిక డ్రోన్స్ వినియోగం పై చేస్తున్న పరిశోధన ల గురించి తెలుసుకున్నారు. అదే విధంగా ఇటీవల అభివృద్ధి చేసిన రోబోటిక్స్ మరియు సెన్సర్ బేస్డ్ ప్రయోగశాలని సందర్శించి ఇప్పటికే కొన్ని రోబోలని వ్యవసాయ రంగం లో ఉపయోగించే విధంగా అభివృద్ధి చేసినందుకు వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలని మంత్రి అభినందించారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వానికి అందించిన ఉపగ్రహ ఆధారిత గణాంకాల గురించి తెలుసుకున్నారు. రాష్ట్రం లోని రైతాంగం యాజమాన్యం పరిధి లో ఉన్న మొత్తం భూమి లో సుమారు 9.3 శాతం భూమి సాగు లో లేదని ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. 99 రోజుల ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక లో భాగం గా వ్యవసాయ విశ్వవిద్యాలయం తలపెట్టిన విత్తన వారోత్సవాలు కార్యక్రమాన్ని మంత్రి లాంఛనం గా ప్రారంభించి పది మంది రైతులకు వివిధ పంటలకి చెందిన నాణ్యమైన మూల విత్తనాలని పంపిణీ చేశారు.

మొదటిపేజీ తరువాయి

# ప్రధాని మోడీతో రామ్మోహన్ కుటుంబం భేటీ

ప్రజల హృదయాల్లో ఆయన ఎందుకు అపారమైన ఆదరణ పొందారో ఆ క్షణంలో మరింత స్పష్టంగా తెలిసింది. ప్రత్యేకంగా.. 'ఏక్ పేడ్ మా కే నామ్' అనే మహత్తర ఆలోచనకు ప్రేరణగా నా తల్లి ప్రధానమంత్రికి మొక్కను బహుకరించడం మా కుటుంబానికి ఎంతో మధురమైన, గర్వకారణమైన క్షణంగా నిలిచిపోతుంది. ఆయన చూపిన ప్రేమ, ఆప్యాయత, ఆశీస్సులకు మేమెప్పటికీ కృతజ్ఞులమే. మాతో గడిపిన అమూల్యమైన సమయానికి వారికి హృదయపూర్వక ధన్యవాదాలు' అని అన్నారు.

మొదటిపేజీ తరువాయి

## దేశంలో పెరుగుతున్న చిన్నారుల అదృశ్యం కేసులు

న్యూఢిల్లీ,మే24నేషనలిస్ట్ వాయిస్

దేశవ్యాప్తంగా నానాటికీ పెరిగిపోతున్న చిన్నారుల అదృశ్యం కేసులపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం దేశంలో దాదాపు 47,000 మంది చిన్నారుల ఆచూకీ లభించకుండా పోయిందని, ప్రతి ఏటా ఈ బ్యాక్‌లాగ్ పెరుగుతుండటంపై తీవ్ర అసంతృప్తిని వెలిబుచ్చింది. ఈ వ్యవస్థాగత లోపాలను సరిదిద్దడానికి, అంతర్రాష్ట్ర మానవ అక్రమ రవాణా ముఠాల నెట్‌వర్క్‌ను ఛేదించడానికి సుప్రీంకోర్టు సంచలన ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. చిన్నారుల అదృశ్యం కేసులను కేవలం 'మిస్సింగ్' కేసులుగా కాకుండా, అంతర్రాష్ట్ర ముఠాల కిడ్నాప్ కోణంలోనే దర్యాప్తు చేయాలని స్పష్టం చేసింది.

మొదటిపేజీ తరువాయి

# యువత ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

హైదరాబాద్,మే24నేషనలిస్ట్ వాయిస్

:దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో జరిగిన రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. యువత స్వయం సమృద్ధి సాధించి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. శనివారం నాడు బోయిగూడలోని రైల్ కళారంగ్‌లో జరిగిన 19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈరోజు 220 మంది కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్నారన్నారు. 2022లో దీపావళి రోజున మొదలైన రోజ్‌గార్ మేళా ద్వారా ఇప్పటివరకు 12.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని వెల్లడించారు. ఇది కేవలం ఉద్యోగాల కార్యక్రమం కాదని, యువత భవిష్యత్తు కోసం మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన పెద్ద మిషన్ అని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ కంపెనీల్లో కూడా కోట్ల సంఖ్యలో ఉద్యోగాలు వస్తున్నాయని అన్నారు. స్టార్టప్స్, యూనికార్న్లు వల్ల యువత ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి వచ్చిందని కేంద్రమంత్రి అన్నారు. రోడ్లు, ఎయిర్‌పోర్టులు, రైల్వేలు, మెట్రోలు, ఇండస్ట్రియల్ కారిడార్లు వంటి ప్రాజెక్టులతో భారీగా ఉపాధి పెరుగుతోందన్నారు. దేశంలో ప్రతి సంవత్సరం రూ.12 లక్షల కోట్ల ఇన్‌ఫ్రా పనులు జరుగుతున్నాయని వివరించారు. ప్రతి లక్ష కోట్ల పెట్టుబడికి 14 నుంచి 15 లక్షల ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. యువతను మోదీ 'వికసిత భారతానికి సూపర్ హీరోలు'గా చూస్తున్నారని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా కోట్ల మంది యువతకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. గ్రామీణ యువతకు కూడా ఏఐ, ఎని వంటి ఆధునిక టెక్నాలజీని మాతృభాషలో నేర్పిస్తున్నామని తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

# వందకోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ,అడ్లూరి లక్ష్మణ్ కుమార్,ఎంపీలు వేం నరేందర్ రెడ్డి,చామల కిరణ్ కుమార్ రెడ్డి,ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య,భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి,తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు,నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం,ఎమ్మెల్సీలు,సీఎంఓ కార్యదర్శి శ్రీనివాసరాజు,దేవదాయ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్,దేవాదాయ కమిషనర్



హనుమంతరావు, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఎస్పీ అక్షాంశ్ యాదవ్,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి ఉన్నతాధికారులు,సంబధిత అధికారులు పాల్గొన్నారు.

శంకుస్థాపనల వివరాలు:-

వేద పాఠశాలకు కొండపై స్వామివారి నిత్య కల్యాణ మండపం నిర్మాణానికి, వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గానికి పై కప్పు నిర్మాణానికి, రథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణానికి,డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో సంబందించిన అధికారులు పాల్గొన్నారు.

# కొయ్యలగూడెం మండల సర్వసభ్య సమావేశం

## - వేసవిలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

## - ఎంపీపీ గంజి మాల రామారావు



**కొయ్యలగూడెం, మే 23:(నేషనలిస్ట్ వాయిస్)**

ఏలూరు జిల్లా స్థానిక కొయ్యలగూడెం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎండీఓ) కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం (జనరల్ బాడీ మీటింగ్) ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా కొయ్యల గూడెం మండల పరిషత్ అధ్యక్షులు (ఎంపీపీ) గంజి మాల రామారావు హాజరయ్యారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్న ఈ సమావేశంలో మండల ంలోని పలు సమస్యలపై కూలం కషంగా చర్చించారు. సమావేశంలో ఎంపీపీ గంజి మాల రామారావు మాట్లాడుతూ, ప్రస్తుత వేసవి కాల తీవ్రత దృష్ట్యా మండలంలోని ఏ ఒక్క గ్రామంలోనూ ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సమన్వయంతో పనిచేసి నీటి సరఫరాకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లే కూలీల సంక్షేమంపై ఎంపీపీ ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. ఎండల తీవ్రత దృష్ట్యా పని ప్రదేశాల్లో కూలీలకు ఉచితంగా మజ్జిగ, తాగునీరు తప్పని సరిగా సరఫరా చేయాలని అధికారు లను ఆదేశించారు. కొంతమంది కూలీలకు ఫోటోలు స్కాన్ కావడం లేదని తన దృష్టికి వచ్చిందని, సాం కేతిక సమస్యలు లేకుండా చూడాలని ఏపీఓకు సూచించారు. కూలీలు ఎండదెబ్బకు గురికాకుండా ఉండేం దుకు, ఉదయమే ఫోటోలు (అటెండెన్స్) తీసి, ఎండ ముదరక ముందే వారిని పనుల నుంచి ఇంటికి పంపించేలా చర్యలు తీసుకోవా లన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారు లకు ఎంపీపీ సూచించారు. ఆసు పత్రిలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలన్నారు. అదేవిధంగా, వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ ఉన్నందున, ఫైర్ ఇంజన్ డిపార్ట్మెంట్ వారు ఎల్లప్పుడూ అలర్ట్‌గా ఉండాలని, ప్రమాదం జరిగిన వెంటనే స్పందించేలా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ సర్వసభ్య సమావేశంలో మండల ఎంపీటీసీలు ఇప్పగంట శ్రీను, చింత శ్రీదేవి, జాన్ డేవిడ్ కింగ్, నారా అన్నపురం ఎంపీటీసీ, అచ్చుతాపురం ఎంపీటీసీ తాతారావులతో పాటు మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడే యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష

## - జిల్లా వ్యాప్తంగా పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి

## - జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్





**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మే 23 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలి మినరీ పరీక్ష2026 నిర్వహణకు జిల్లావ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు పకడ్బం దీగా పూర్తి చేసినట్లు హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ తెలిపారు. శనివారం హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. పరీక్షా కేంద్రం లోని ప్రతి గదిలో సదు పాయాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణకు సంబంధించిన మెటీరియల్ ను పరిశీలించడంతో పాటు తాగునీరు, ఫ్యాన్లు, విద్యుత్ దీపాలు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలను తనిఖీ చేశారు. హాల్ టికెట్ నెంబరింగ్, ఇన్విజిలేటర్లు, రూట్ అధికారులు ఇతర సిబ్బంది విధులపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష నేడు రెండు సెషన్లలో నిర్వహించబడుతుందని తెలిపారు. ఉదయం 9:30 గంటల నుండి 11:30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2:30 గంటల నుండి 4:30 గంటల వరకు రెండో సెషన్ జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 10 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 4,075 మంది అభ్యర్థులు పరీక్ష రాయను న్నారని వెల్లడించారు. పరీక్ష ప్రారంభానికి 30 నిమిషాల ముందే పరీక్షా కేంద్రాల ప్రధాన గేట్లు మూసి వేయబడతాయని, ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, గడియారాలు తీసుకురావద్దని సూచించారు. హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన ఫోటో గుర్తింపు కార్డును తప్పనిసరిగా వెంట తీసుకురావాలని తెలిపారు.

పరీక్షా కేంద్రాల్లోకి ప్రవేశించే అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, పరీక్ష నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాల ని అధికారులకు ఆదేశించారు. జిల్లాలోని హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ఫాతిమానగర్ లోని సెయింట్ గాబ్రియల్ హై స్కూల్, హంటర్ రోడ్డులోని న్యూ సైన్స్ డిగ్రీ కాలేజ్, అడ్వకేట్స్ కాలనీలోని ఎస్సార్ నేషనల్ హై స్కూల్, వడ్డేపల్లిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ములుగు రోడ్డులోని శ్రీ గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాల, భద్రకాళి దేవాలయం సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, లాల్ బహదూర్ కళాశాల అశోక జంక్షన్ సమీపం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష నిర్వహించబడుతుందని తెలిపారు. పరీక్ష నిర్వహణకు సంబంధించిన అంశాలపై కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో యూపీఎస్సీ సెంట్రల్ ఇన్‌స్పెక్షన్ అధికారి శుభం గాద్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, వైస్ ప్రిన్సిపల్ ఎస్.ఎం. రెహమాన్, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, రూట్ అధికారి భావ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# భూముల మార్కెట్ విలువల సవరణ వేగ వంతం చేయాలి

## - సీసీఎల్ఏ లోకేష్ కుమార్





**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మే 23 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

భూముల మార్కెట్ విలువల సవరణ ప్రక్రియను వేగ వంతంగా పూర్తి చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ డి.ఎస్. లోకేష్ కుమార్, ఐఏఎస్ అధికారులను ఆదేశించారు.రాష్ట్ర వ్యాప్తంగా భూముల మార్కెట్ విలువల సవరణ ప్రక్రియ పురోగతిపై శనివారం హైదరాబాద్ నుంచి భూ పరిపాలన ప్రధాన కమిషనర్ డి.ఎస్. లోకేష్ కుమార్, ఐఏఎస్ అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు (రెవెన్యూ) లతో ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి హన్మకొండ జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూ పరిపాలన ప్రధాన కమిషనర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న మార్కెట్ డిమాండ్ వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఈ నెల 28వ తేదీ నాటికి మార్కెట్ విలువల సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.క్షేత్ర స్థాయిలో ఉన్న వాస్తవ మార్కెట్ ధరలను సమగ్రంగా పరిశీలించి, ఎలాంటి వ్యత్యాసాలు లేకుండా శాస్త్రీయ విధానంలో మార్కెట్ విలువలను ఖరారు చేయాలని సూచించారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి, నిర్దేశిత గడువులోగా నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు.హన్మకొండ జిల్లాలో భూముల మార్కెట్ విలువల సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, గడువులోగా పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం మార్కెట్ లో ఉన్న డిమాండ్ ను దృష్టిలో ఉంచుకుని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సవరణలు చేపడతామని పేర్కొన్నారు.

# రిజర్వేషన్లతో కొందరికే లబ్ది !

స్వాతంత్ర్యం లభించి 80ఏళ్లకు చేరువలో ఉన్నాం. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ప్రజలు త్యాగాలు చేస్తుంటే కొందరు ఫలితాలు అనుభవిస్తున్నారు. ముఖ్యంగా భారతదేశంలో రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు అనుభవిస్తున్న లగ్జరీ జీవితం అంతా ఇంతా కాదు. ఒక్కసారి ఎమ్మెల్యే, ఎంపి అయితే చాలు..జీవితాంతం సుఖంగా బతికేయవచ్చన పరిస్థితి ఏర్పడింది. పేరుకే ప్రజాస్వామ్యం కానీ.. అదృష్టమంతా ప్రజాప్రతినిధులదే. అధికారాన్ని గుప్పిట్లో పెట్టుకుని ప్రజలను ఓట్లేసే పురుగుల్లా చూస్తున్నారు. కొన్ని తాయిలాలు ప్రకటించి, మొత్తం అధికారం, ఆర్థిక స్వేచ్ఛ వారు అనుభవిస్తున్నారు. అందుకే ప్రజల్లో నివురుగప్పిన నిప్పులా ఉన్న ఆగ్రహం అప్పుడప్పుడు కట్టలు తెంచుకుంటోంది. ఒక్కోసారి చిన్న సమస్యగా ఉన్న వ్యవహారం పెద్ద ఎత్తున ఉవ్వెత్తున ఎగిసి పడుతోంది. ఇటీవల కాక్రోచ్ జనతా పార్టీ ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవాలి. ప్రజల్లో ఏమూలో దాగివున్న ఆగ్రహం ఇలా బయటకు వస్తోంది. వివిధ రూపాల్లో ఉన్న వ్యతిరేకత ఒక్కటైతే రాజకీయ పార్టీల నేతలు తట్టుకోవడం కష్టం. అనేక దేశాల్లో ఇలాగే ప్రజాగ్రహం కట్టలు తెంచుకున్న సంగతి చూశాం. నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక, వెనిజులా తదితర దేశాల్లో ప్రజల ఆగ్రం ఎలా పరిణమించిందో చూశాం. అందువల్ల పాలకులు ప్రజాసంక్షేమం కోరి నిర్ణయాలు తీసుకోవాలి. వాటిని ఆచరణలో పెట్టాలి. నిరంతరం సమస్యలతో పోరాడుతున్న ప్రజలను పట్టించుకోవాలి. తమ సుఖం కాదు..ప్రజల సంక్షేమం ముఖ్యమని గమనించాలి. ధాన్యం కొనుగోలల్లు కావచ్చు, ఫీజుల మోత కావచ్చు...నిరుద్యోగం కావచ్చు...ఇలా అనేక సమస్యలపై ప్రజల్లో ఆందోళనలు గూడుకట్టుకుని ఉన్నాయి. అంఉదకే తరతరాలుగా అధికారంలో తామే ఉండాలన్న కుటిల రాజకీయాలు మానాలి. ఇకపోతే తాజాగా సుప్రీం ధర్మాసనం రిజర్వేషన్ల తీరుపై అసహనం వ్యక్తం చేసింది. దీనిపై చర్చ జరగాలి. చట్టసభల్లో ఇలాంటి వాటిపై చర్చించాలి. కొందరే రిజర్వేషన్ల ఫలాలు అనుభవించడంపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు చేసింది. కొందరే వీటిని పదేపదే అనుభవించడం ద్వారా మిగతావారికి అడ్డుపడుతున్నారని అభిప్రాయపడింది. గతంలో సిజెఐగా పనిచేసిన బిఆర్ గవాయ్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. క్రిమిలేయర్ ఉండాలని ఆయన ఆనాడు అభిప్రాయ పడ్డారు. కొందరు రిజర్వేషన్లు అనుభవించాక, తమ కుటుంబంలోని వారంతా అదే రిజర్వేషన్ల మెట్లెక్కాలని చూస్తున్నారు. తాజాగా ఇప్పుడు సుప్రీం ధర్మాసనం కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. వెనుకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన కుటుంబాల పిల్లలకు రిజర్వేషన్ ప్రయోజనాలను కొనసాగించాలని కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఉన్నత స్థితికి చేరుకున్న కుటుంబాలు పదేపదే రిజర్వేషన్ ప్రయోజనాలు పొందడంపై ఆందోళన వ్యక్తం చేసింది. ఎందుకంటే ఇలా ర ఇజర్వేషన్లు పొందిన వారు రాజకీయంగా వారే స్థిరపడిపోతున్నారు. ఉన్నత శ్రేణి ఉద్యోగలు సాధించిన ఐఎఎస్, ఐపిఎస్‌లు కూడా తమ పిల్లకు రిజర్వేషన్లు పొందుతున్నారు. దీనినే సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. దేశంలో రిజర్వేషన్ల ఫలాలు అందుకొని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలు.. తరతరాలుగా అదే కోటాను కోరుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ పూర్తి స్థాయిలో స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకని అత్యున్నత న్యాయస్థానం సంచలన ప్రశ్నలు సంధించింది. ఇది చర్చించాలి. లేకుంటే ప్రజల్లో ఇలాంటి వ్యత్యాసాలపైనా వ్యతిరేకత వస్తుంది. ఎక్కడో ఒకచోట దీనికి చెక్ పెట్టాలి. రిజర్వేషన్లు ఎల్లకాలం కాదన్న నిజం బయటకు రావాలి. అవసరమైతే చట్టం చేయాలి. వెనుకబడిన వర్గాల్లోని 'క్రీమీలేయర్' పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధికారత ద్వారా సమాజంలో ఒక స్థాయి లభిస్తుందని పేర్కొన్నారు. 'రిజర్వేషన్ల ద్వారా ఒకసారి ఉన్నత స్థాయికి చేరుకున్నాక కూడా, మళ్లీ వారి పిల్లల కోసం రిజర్వేషన్ కోటాను ఆశించడం సరికాదన్నారు. ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేం. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉందని వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండవచ్చని.. కానీ, రిజర్వేషన్ల ప్రయోజనం పొంది తల్లిదండ్రులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుందని, ఇక్కడ ఒక సమతుల్యత అవసరమని కోర్టు స్పష్టం చేసింది. ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే అన్ని అవకాశాలను చేజిక్కించుకుంటే, అదే వర్గంలోని అత్యంత వెనుకబడిన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. రిజర్వేషన్ల ఫలాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజంలో కిందిస్థాయిలో ఉన్న చివరి వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. రాజకీయంగా ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్లు పొందుతున్న వారు తమ కుటుంబాలకు కూడా రిజర్వేషన్ కోటాలో లబ్ది పొందుతున్నారు. ఒకే కుటుంబం నుంచి రిజర్వేషన్ల కోటాలో ఎన్నికై ఎమ్మెల్యేలు, ఎంపిలు అయి మంత్రి పదవులు అనుభవిస్తున్నారు. ఇలాంటి వారివల్ల పక్కన ఉన్నవారు ఎన్నటికీ రిజర్వేషన్లు పొందలేక పోతున్నారు. దీనిపై దేశవ్యాప్తం చర్చ జరగాలి. కాక్రోచ్ జనతాపార్టీ కూడా చర్చించాలి. వెనకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా ఉన్నత స్థితిలో ఉన్న కుటుంబాలకు చెందిన పిల్లలకు రిజర్వేషన్లు ఎందుకని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అలాంటి వారు కూడా రిజర్వేషన్లు కొనసాగించాలని కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తి తల్లిదండ్రులిద్దరూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అయినందున క్రీమీలేయర్ కిందకు వస్తారని.. రిజర్వేషన్ వర్తించదంటూ ఆ రాష్ట్ర హైకోర్టు తీర్పు ఇచ్చింది. దాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా రిజర్వేషన్లపై కీలక వ్యాఖ్యలు చేసింది. ఇప్పుడు రాజకీయాల్లోనూ రిజర్వేషన్లపై చర్చించాలి. అప్పుడే మిగతా వారికి రిజర్వేషన్ ఫలాలు దక్కుతాయి.

# ఎస్పీఎంలో గుర్తింపు ఎన్నికలు వెంటనే నిర్వహించాలి

## - భూపాల్ సిర్పూర్ పేపర్ మిల్ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ డిమాండ్..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా మే 23(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు యూనియన్ ఎన్నికలు నిర్వహించాలని గత మూడు రోజులుగా ఎస్పీఎం గేటు ముందు జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరాహార దీక్షలకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్టు సిర్పూర్ పేపర్ మిల్ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ తెలియజేశారు. ఈ సందర్భంగా భూపాల్ గారు మాట్లాడుతూ గుర్తింపు యూనియన్ ఎన్నికలు లేకపోవడం వల్ల కార్మికులకి న్యాయమైన అనేక సమస్యలు పరిష్కారం కాకుండా పోతున్నాయని ఎన్నికల నిర్వహించకుండా హైకోర్టును లో కేసు వేసి ఎస్పీఎం యాజమాన్యం అడ్డుకుంటుందని ఇది సరైనది కాదని అన్నారు. ఇప్పటికైనా ఎస్పీ యాజమాన్యం బే షరతుగా హైకోర్టులో వేసినటువంటి కేసును వెనక్కి తీసుకోవాలని ఎస్పీఎంలో గుర్తింపు యూనియన్ ఎన్నికలు నిర్వహించుటకు సహకరించాలని, గెలిచిన యూనియన్ తోటే అగ్రిమెంటు నిర్వహించాలని అప్పటివరకు అడ్డ హక్ పేమెంట్ గా ఏప్రిల్ ఒకటి నుండి ప్రతినెల కార్మికుడికి పదివేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో ఇతర అనేక ప్రాంతాలలో ఈ 2026 సంవత్సరంలోనే పదుల పరిశ్రమలలో ఎన్నికలు జరిగాయని ఎస్పీఎంలో మాత్రమే లేబర్ కోడ్లను అడ్డం పెట్టుకొని ఎన్నికలను అడ్డుకోవడం సరి అయింది కాదని, కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్లను అమలు చేసిన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఇంకా నోటిపై చేసి రూల్స్ ఫ్రేమ్ చేయలేదని తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికీ లేబర్ కోట్లు అమలు కావడం లేదని అయినప్పటికీ లేబర్ కోడ్ లను అడ్డుపెట్టుకొని ఎన్నికలను అడ్డుకోవడం సరైన పద్ధతి కాదని అన్నారు.వర్క్స్ కమిటీకి రాజీనామా...



సిర్పూర్ పేపర్ మిల్ మజ్దూర్ యూనియన్ ఉపాధ్యక్షులు ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో ఉన్న ప్రత్యేక పరిస్థితుల వల్ల ఏ యూనియన్ ముందుకు రాని సమయంలో వర్క్స్ కమిటీగా కార్మికుల సమస్యల మీద పనిచేయడం జరిగిందని ఎన్నికల డిమాండ్ ముందుకు వస్తున్న నేపథ్యంలో గత అగ్రిమెంట్ పీరియడ్ కూడా ముగిసిన సందర్భంలో ఇక వర్క్స్ కమిటీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ పేపర్ మిల్ మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రెటరీ కూశన రాజన్న ఉపాధ్యక్షులు షబ్బీర్ అహ్మద్, మొగిలి వెంకటేష్, సహాయ కార్యదర్శి గడమల్ల మహేష్, యూనియన్ నాయకులు విజయ్, నబిబాయి జానీ, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్. త్రివేణి, జె. రాజేందర్, కృష్ణమాచారి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజశీ ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులపై మంత్రితో చర్చించిన ఎమ్మెల్యే

**దేవరకద్ర మే 23 నేషనలిస్ట్ వాయిస్**

దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో పలు అభివృద్ధి పనుల పై తెలంగాణ రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో, అలాగే వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో శనివారము సెక్రెటరీ లో స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి, సమావేశమై చర్చించారు. అలాగే మంత్రికి ఎమ్మెల్యే జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంత్రికి బొకేను అందజేసి శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు పాల్గొన్నారు.





# ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

## - డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. లక్ష్మణరావు డిమాండ్

**తాడేపల్లిగూడెం ప్రతినిధి మే23 (నేషనలిస్ట్ వాయిస్)**




ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. లక్ష్మణరావు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కోసం కేటాయించిన సబ్ ప్లాన్ నిధులను ఇతర అవసరాలకు మళ్లించడం సరికాదన్నారు. జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించి, వాటిని పూర్తిగా ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, అభివృద్ధికే ఖర్చు చేయాలన్నారు. సబ్ ప్లాన్ నిధులతో ప్రతి ఎస్సీ, ఎస్టీ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.. గత వైకాపా ప్రభుత్వ హయాంలో సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టాయని, కూటమి ప్రభుత్వమైనా చట్టాన్ని తూచా తప్పకుండా అమలు చేసి దళిత, గిరిజనులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి రెండు సంవత్సరాలైనా ఇప్పటివరకు ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని అమలు చేయకపోవటం దారుణమని, ఈ చట్టం అమలు కోసం రాష్ట్రవ్యాప్తంగా

# ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ చేతుల మీదుగా ములకాల శేషుకు రూ.80,833 సిఎమ్ఆర్ఎఫ్ చెక్కు అందజేత

**చింతలపూడి, మే 23:(నేషనలిస్ట్ వాయిస్)**

ఏలూరు జిల్లా చింతలపూడి నియోజకవర్గం కామవరపుకోట మండలానికి చెందిన ములకాల శేషుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ. 80,833/- విలువైన చెక్కును చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ శనివారం వారి చేతుల మీదుగా అందజేశారు.ఆరోగ్య సమస్యల నిమిత్తం ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకోగా, ప్రభుత్వం స్పందించి ఈ నిధులను విడుదల చేసింది. ఈ సందర్భంగా లబ్ధిదారుడు శేషు మరియు ఆయన కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే రోషన్ కుమార్ ని కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆపద సమయంలో తమకు అండగా నిలిచిన ప్రభుత్వానికి, సహాయం త్వరగా అందేలా కృషి చేసిన శాసనసభ్యులకు వారు ధన్యవాదాలు ప్రకటించారు.




# పట్టణ స్వచ్ఛతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

## - పురపాలక సంఘ కమిషనర్ ఏసుబాబు

**తాడేపల్లిగూడెం ప్రతినిధి మే 23 (నేషనలిస్ట్ వాయిస్)**

పట్టణ స్వచ్ఛతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పురపాలక సంఘ కమిషనర్ ఎం.ఏసుబాబు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని పురపాలక సంఘ కమిషనర్ ఏసుబాబు ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు. ఏరియా హాస్పిటల్ వద్ద రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను కమిషనర్ స్వయంగా చీపురు పట్టి శుభ్రం చేశారు. అధికారులు, సిబ్బందితో కలిసి శ్రమదానం చేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న మురుగు కాల్వలను శుభ్రం చేయించి, పూడిక తీయించారు. దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్, మలేరియా ఆయిల్ స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఏసుబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆపరేషన్ క్లీన్ స్వీప్ ను పకడ్బందీగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజారోగ్యం బాగుంటుందని అధికారులు చెప్పడమే కాకుండా చేసి చూపించాలన్నారు.. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, శానిటేషన్ కార్మికులు, పలువురు రాజకీయ నాయకులు, పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.





# ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులపై ఎమ్మెల్యే కి సమగ్ర నివేదిక సమర్పణ

**దేవరకద్ర మే 23 నేషనలిస్ట్ వాయిస్**

మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులపై ప్రభుత్వ విప్ & ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కి సమగ్ర నివేదిక శనివారం సమర్పించబడింది. నియోజకవర్గంలోని మొత్తం 199 ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన విద్యా సమన్వయకర్తలు జగపతి రావు, హర్షవర్ధన్ రెడ్డి, డి. వెంకటనర్సయ్య యాదవ్, ఫరూక్ హుస్సేన్ పాఠశాలల ప్రస్తుత పరిస్థితులపై నివేదికను సిద్ధం చేసి ఎమ్మెల్యే కి క్యాంపు కార్యాలయంలో అందజేశారు.ఈ నివేదికలోపాఠశాలలకు అవసరమైన భౌతిక వనరులు,మైనర్, మేజర్ మరమ్మత్తులు,మౌలిక వసతుల కల్పన,పాఠ్యాంశాల బోధనకు అవసరమైన విద్యా వాలంటీర్ల నియామకంవంటి కీలక అంశాలపై సమగ్ర సమాచారం పొందుపరచబడింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ప్రతి పాఠశాల స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పించిన విద్యా సమన్వయకర్తల కృషి ప్రశంసనీయమని తెలిపారు. ఇది వారి నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, రాబోయే విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచేందుకు కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# ఉపాధి హామీ పనులను పరిశీలించి, చల్లని మాజా పానీయం పంపిణీ సర్పంచ్ పొట్టే ఉమా మహేశ్

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా మే 23(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్పేట్ మండలం బొంబాయిగూడ గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను సర్పంచ్ పొట్టే ఉమా మహేశ్ క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించారు కూలీలతో మాట్లాడి పనుల పురోగతిని అడిగి తెలుసుకొని , ఉపాధి హామీ కూలీలకు చల్లటి మాజా పానీయం అందించారు.ఈ సందర్భంగా సర్పంచ్ పొట్టే ఉమా మహేశ్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపడు తున్నా యాన్నారు. కూలీలకు సకాలంలో పని కల్పించడంతో పాటు వేతనాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.వేసవిలో ఎండ తీవ్రత నేపథ్యంలో కూలీలకు నీడ మంచినీళ్ళ వసతి కల్పించాలని సిబ్బందికి ఆదేశించారు .పనుల్లో నాణ్యత పాటించాలని నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సూచించారు ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి విలాస్, పీల్డ్ అసిస్టెంట్ సురేశ్, వార్డు మెంబర్ లచ్చన్న, సామాజిక కార్యకర్త చప్పిడి ప్రకాశ్ నాయకులు, మహేశ్, కమలాకర్, లక్ష్మి నారాయణ మరియు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.



# యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మే 23 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**




నేడు నిర్వహించనున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలను పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమలు చేస్తు నట్లుగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షా కేంద్రాల నుండి ఐదు వందల మీటర్ల పరిధిలో నేడు ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు సెక్షన్ 163 బి. ఎన్. ఎన్. ఎస్ చట్టాన్ని అను సరించి గుమి కూడడం, ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించడం నిషేధమని ఎవరైనా ఈ ఉత్తరం అతిక్రమిస్తే చట్టపర చర్యలు తప్పవని సిపి తెలిపారు.

# పెంచిన పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలను తగ్గించాలి - సీపీఎం డిమాండ్

## - మల్లప్పగూడెంలో సీపీఎం నిరసన

## - కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై మండిపాటు

**టి. నరసాపురం, మే 23:(నేషనలిస్ట్ వాయిస్)**




ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విపరీతంగా పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ మరియు నిత్యావసర సరుకుల ధరలను తక్షణమే తగ్గించాలని సీపీఎం డిమాండ్ చేసింది. శనివారం ఏలూరు జిల్లా టి. నరసాపురం మండల పరిధిలోని తిరుమలదేవిపేట పంచాయతీ, మల్లప్పగూడెం గ్రామంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసనను ఉద్దేశించి సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిల్లి రామకృష్ణ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజలపై పెనుభారాలు మోపుతున్నాయని మండిపడ్డారు. అంతర్జాతీయ పరిణామాల సాకుతో పెట్రోల్, డీజిల్ ధరలను విపరీతంగా పెంచేశారని, ఫలితంగా ఉప్పు, పప్పు, వంటనూనె వంటి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని విమర్శించారు. అలాగే "ఒకవైపు కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్ల రూపాయల రాయితీలు ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం.. మరోవైపు అధిక ధరలతో సామాన్యులను ముంచుతోంది. అటు రైతులకు కనీస గిట్టుబాటు ధర ఇవ్వడం లేదు. పైగా యూరియా, డీఏపీ వంటి ఎరువులను కూడా సకాలంలో సరఫరా చేయకుండా రేషన్ పద్ధతిలో ఇస్తూ రైతాంగాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారు." అని పిల్లి రామకృష్ణ, సీపీఎం జిల్లా నేత తెలిపారు. తక్షణమే పెంచిన ధరలను తగ్గించి సామాన్య, మధ్యతరగతి ప్రజలను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గుడలి వెంకట్రావు, మండల కార్యదర్శి మడకం సుధారాణి, కమిటీ సభ్యులు మనకు కుమారి, బరగడ కుమారి, శిరీష, మురళి, దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వై.సి.పి.పాలనలో మోసపోయాం

## - అప్పారావుపేట గ్రామస్తుల ఆవేదన

## - న్యాయం చేస్తానని హామీ ఇచ్చిన

## - ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

**తాడేపల్లిగూడెం ప్రతినిధి మే 23 (నేషనలిస్ట్ వాయిస్)**

ఇల్లులేని ప్రతి నీరుపేద కుటుంబానికి సొంత ఇల్లు సమాకుర్చటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని శాసన సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. వైసిపి హయాంలో మోసపోయిన బాధితులందరికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తాడేపల్లిగూడెం మండలం అప్పారావుపేట గ్రామానికి చెందిన సుమారు 40 మంది లబ్ధిదారులు శనివారం స్థానిక జనసేన కార్యాలయంలోఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం ఇచ్చారు. గత వైసిపి హయాంలో ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరు చేశారని, కానీ అవి ఎక్కడ ఉన్నాయో తెలియటంలేదని వాపోయారు. ఈ విషయంలో తమను వైసిపి నేతలు మోసం చేశారని బాధితులు ఆరోపించారు. ఈ విషయాన్ని అప్పారావుపేట జనసేన నాయకుల సహకారంతో శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లామని, తమకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని బాధితులు వివరించారు.



# ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలి.. ఎమ్మెల్యే జీఎంఆర్

**దేవరకద్ర మే 23నేషనలిస్ట్ వాయిస్**

ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడిన దోషులను వెంటనే కఠినంగా శిక్షించాలని స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి కోరారు.సిట్ అధికారులు గత ప్రభుత్వం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, ఫోన్ ను ట్యాపింగ్ చేయడం జరిగిందని, ఫోన్ ట్యాపింగ్ కు సంబంధించి, వాంగ్మూలం అందజేయాలని కోరడంతో శనివారం హైదరాబాద్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, సిట్ ముందు హాజరై వాంగ్మూలం అందజేశారు.ఈ సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ. గత ప్రభుత్వం ఇల్లీగల్ గా ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడిందని, ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడ్డ దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు.గత ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడుతున్న నాటి టీపీసీసీ అధ్యక్షులు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ని కట్టడి చేయడానికి గత ప్రభుత్వం ఇల్లీగల్ గా ఫోన్ టాపింగ్ కు పాల్పడిందని, డీసీసీ అధ్యక్షులు గా ఉన్న సమయంలో మా ఫోన్లను ట్యాప్ చేయడం జరిగిందని, దానికి సంబంధించి సిట్ వాంగ్మూలం ఇవ్వాలని కోరడంతో వాంగ్మూలం ఇవ్వడం జరిగింద అని ఆయన తెలిపారు తెలిపారు.





# ముస్లిం మహిళలపై అనుచితంగా మాట్లాడిన జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ను భర్తరఫ్ చేయాలి

**బాపట్ల : మే 23 (నేషనలిస్ట్ వాయిస్)**



ముస్లిం మహిళలపై అనుచితంగా మాట్లాడిన అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ను ఎమ్మెల్యే పదవి నుండి వెంటనే భర్తరఫ్ చేయాలని నవతరం పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు ఎస్ కె కరీం డిమాండ్ చేశారు.అదే విధంగా అరవ శ్రీధర్ ను వెంటనే అరెస్ట్ చేయాలని అన్నారు. జనసేన పార్టీ నుండి సస్పెండ్ చేయాలని జనసేన అధ్యక్షులు,రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ ను కోరారు.ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ముస్లిం మహిళల జోలికొస్తే సరైన సమయంలో సరైన బుద్ధి చెప్తామని హెచ్చరించారు.

# శ్రీనివాస్ గౌడ్ మనుమ రాలు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే..

**దేవరకద్ర మే 23 నేషనలిస్ట్ వాయిస్**

మండల పరిధిలోని జీనుగురాల గ్రామానికి చెందిన బి ఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ గౌడ్ మనమరాలు జన్మదిన వేడుకలు జిల్లా కేంద్రంలోని కన్వెన్షన్ హాల్లో శనివారం జరగగా స్థానిక మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొని ఆ చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ మాజీ పార్టీ సర్పంచులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






# మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

**దేవరకద్ర మే 23 నేషనలిస్ట్ వాయిస్**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు భవనాల సినిమా ఆటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శనివారము జన్మదిన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే చీ మధుసూదన్ రెడ్డి మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే తో పాటు జినురాల గ్రామ సర్పంచ్ నాగమ్మ సాయిలు మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



# హెల్మెట్ లేని ప్రయాణం.. ఇంట్లో నవ్వులను ఫోటోలుగా మార్చేస్తుంది!

## - ఏలూరు జిల్లా టీ. నర్సాపురం ఎస్ఐ జయబాబు

## భావోద్వేగ వాట్సాప్ స్టేటస్.. వైరల్!

**టీ. నర్సాపురం, మే 23 (నేషనలిస్ట్ వాయిస్):**

"రోడ్డుపై పడిపోయిన రక్తాన్ని చూసి ప్రపంచమంతా యాక్సిడెంట్ అంటుంది.. కానీ ఒక తల్లి మాత్రం తన ప్రపంచాన్ని కోల్పోతుంది. హెల్మెట్ పెట్టుకోకుండా వెళ్లిన ఆ ఒక్క నిర్లక్ష్యం.. ఇంట్లో నవ్వులను ఫోటోలుగా మార్చేస్తుంది!"ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనే ఉద్దేశంతో ఏలూరు జిల్లా టీ. నర్సాపురం మండల సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్ఐ) జయబాబు తన వాట్సాప్ స్టేటస్‌లో పెట్టిన ఈ భావోద్వేగ సందేశం ప్రస్తుతం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రజల ప్రాణాల రక్షణే ధ్యేయంగా, ఒక బాధ్యతాయుతమైన పోలీస్ అధికారిగా ఆయన వ్యక్తపరిచిన ఆవేదన వాహనదారుల హృదయాలను కదిలిస్తోంది.సాధారణంగా నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు విధించడం, కేసులు నమోదు చేయడం పోలీసుల విధి. అయితే, ఎస్ఐ జయబాబు మాత్రం అందుకు భిన్నంగా మానవీయ కోణంలో ఆలోచించి, ప్రజల్లో స్వచ్ఛందంగా మార్పు తీసుకురావడానికి ఈ వినూత్న ప్రయత్నం చేశారు."నీకు అది చిన్న అసౌకర్యం కావొచ్చు.. కానీ నీ ప్రాణం మీద ఎవరో ఒకరి జీవితం ఆధారపడి ఉంటుంది

." జయబాబు, సబ్ ఇన్స్పెక్టర్, టీ. నర్సాపురం

### కుటుంబాలకు తీరని శోకం మిగల్చవద్దు..

రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు కేవలం ఒక ప్రాణం మాత్రమే పోదని, ఆ వ్యక్తిపై ఆధారపడిన కుటుంబం మొత్తం రోడ్డున పడుతుందని ఎస్ఐ ఆవేదన వ్యక్తం చేశారు. హెల్మెట్ ధరించడం అనేది కాసేపు చిన్న అసౌకర్యంగా అనిపించినా.. అది ప్రాణాలను కాపాడే రక్షణ కవచమని గుర్తుచేశారు. క్షణకాల నిర్లక్ష్యం వల్ల ఎన్నో కుటుంబాల్లో నవ్వులు మాయమై, గోడలపై ఫోటోలుగా మిగిలిపోతున్నాయని ఆయన హెచ్చరించారు.కేవలం చట్టాన్ని అమలు చేయడమే కాకుండా, ప్రజల ప్రాణాల పట్ల ఇంతటి సామాజిక బాధ్యతతో స్పందించిన ఎస్ఐ జయబాబుపై మండల ప్రజలతో పాటు సామాజిక మాధ్యమాల్లో ప్రశంసల జల్లు కురుస్తోంది. ఈ సందేశాన్ని చూసైనా వాహనదారులు తమ ప్రయాణ తీరును మార్చుకోవాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా హెల్మెట్ ధరించి తమ కుటుంబాల కోసం సురక్షితంగా ఇళ్లకు చేరాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు..

# విద్యార్థులకు బహుమతులు అందించిన ఎమ్మెల్యే

**దేవరకద్ర మే 23 నేషనలిస్ట్ వాయిస్**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక యూత్ అండ్ స్పోర్ట్స్ వీక్ ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ మరియు మహబూబ్నగర్ ఎమ్మెల్యే ఎన్నం శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా గతంలో జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. టూరిజం సందర్శనలో భాగంగా గత రెండు రోజుల కిందట కోయిల్ సాగర్ ప్రాజెక్టును జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ సందర్శించినప్పుడు విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు కనకప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.




# ధాన్యం కొనుగోళ్లలో పూర్తి నిర్లక్ష్యం

## రైతుల అగచాట్లు పట్టని ప్రభుత్వం: వేముల

**నిజామాబాద్,మే23 (నేషనలిస్ట్ వాయిస్):**

పంట కొనుగోలులో దారుణంగా విఫలమైన ప్రభుత్వం అన్నదాతల ఆత్మహత్యలపై తప్పుడు లెక్కలు చెప్తున్నదని మాజీమంత్రి వేమలు ప్రశాంతరెడ్డి మండిపడ్డారు. ధాన్యం ఎక్కడా సక్రమంగా కొనగడం లేదన్నారు. నిజామాబాద్‌కు వస్తే రైతులు పడుతున్న అగచాట్లను చూపిస్తానని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో చనిపోయిన రైతులు పది మందిపైనే ఉన్నారని, కానీ ఒక్కరూ చనిపోలేదని మంత్రి అనడం సిగ్గుచేటని నిప్పులు చెరిగారు. 'పంటలు కొనక పోవడంతో గగ్గోలు పెడుతూ రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలు కూడా రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నా కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రైతులు ప్రాణాలు కోల్పోయినా నిస్సిగ్గుగా అబద్దాలు చెప్తున్నారని విరుచుకుపడ్డారు.

# ఉపాధి కూలీల దాహార్తి తీర్చిన సామాజిక కార్యకర్తలు

**టీ. నర్సాపురం మే 23(నేషనలిస్ట్ వాయిస్)**

ఏలూరు జిల్లా టీ . నర్సాపురం మండలంలో శనివారం ఉపాధి హామీ కూలీలకు లస్సీ, మజ్జిగ పంపిణీ చేశారు. సాకి రేవు చెరువు, నందమూరి విజయసాగర్ (పెద్ద చెరువు) వద్ద పనులు చేస్తున్న సుమారు 300 మంది కూలీలకు దాతల ఆర్థిక సహకారంతో సామాజిక కార్యకర్తలు ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమ సమన్వయకర్త తాటి గడప జయరాజుతో పాటు సామాజిక కార్యకర్తలు యస్.డి. నాసర్ పాషా, కొరివి శేషారావు, కొరివి నాగేశ్వరరావు, పింగుల మధు, కొక్కొండ నాగ చారి, ఫీల్డ్ అసిస్టెంట్ బైగాని చందు తదితరులు పాల్గొని కూలీలకు మజ్జిగ అందజేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా కూలీల ఆరోగ్యం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామని, దాతలు ఇలాంటి సేవా కార్యక్రమాలకు సహకరించాలని వారు కోరారు. ఈ సేవాయజ్ఞానికి సామాజిక కార్యకర్త తాటి గడప జయరాజు సమన్వయకర్తగా వ్యవహరించగా.. సామాజిక కార్యకర్తలు యస్.డి. నాసర్ పాషా, కొరివి శేషారావు, కొరివి నాగేశ్వరరావు, పింగుల మధు, కొక్కొండ నాగ చారి, ఫీల్డ్ అసిస్టెంట్ బైగాని చందు కూలీలకు చల్లటి పానీయాలను పంపిణీ చేశారు. "తీవ్రమైన ఎండల వల్ల కూలీలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. అందుకే వారి ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ చిన్న ప్రయత్నం చేశాం. సమాజంలో ఉన్న దాతలు మరికొంత మంది ముందుకు వచ్చి ఇలాంటి సేవా కార్యక్రమాలను ప్రోత్సహించాలి." అని నిర్వాహకులు కోరారు.





# ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ, బిస్కెట్ల పంపిణీ

## - రాజుపోతేపల్లిలో తెలుగుదేశం పార్టీ నాయకుల చొరవ

**టి. నరసాపురం, మే 23:(నేషనలిస్ట్ వాయిస్)**

టీ. నర్సాపురం మండల పరిధిలోని రాజుపోతేపల్లి గ్రామంలో శనివారం ఉపాధి హామీ కూలీలకు ఎండ తీవ్రత నుండి ఉపశమనం కలిగించేందుకు మజ్జిగ, బిస్కెట్లను పంపిణీ చేశారు. టి.నరసాపురం మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు దావులూరి సూర్యనారాయణ, రాజుపోతేపల్లి టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు మద్దిపాటి కనకదుర్గారావుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఉపాధి పనులు చేసుకుంటున్న సుమారు 250 మంది శ్రామికులకు చల్లని మజ్జిగతో పాటు బిస్కెట్లను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయని, ఇటువంటి తరుణంలో ఉపాధి కూలీలు వడదెబ్బకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కూలీల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకునే ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు.అలాగే ఈ పంపిణీ కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గ టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు చిలకా బాలయ్య, నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు చిలకా సుబ్బు, వార్డ్ మెంబర్ రామారావు, నత్తా నాగరాజు పాల్గొన్నారు.అంతేకాకుండా టిడిపి సీనియర్ నాయకులు ముసునూరి బాలస్వామి, కొల్లి వెంకటేశ్వరరావు, ఉండవల్లి వీరభద్రరావు, కొల్లి సత్యనారాయణ, నెక్కలపూడి మల్లేశ్వరరావు, సూరెడ్డి నాగేశ్వరరావు, యువ నాయకులు గుండు గౌరీశంకర్, మరియు ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ అందుగుల వెంకట్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





# సిండికేట్ దోపిడిని అరికట్టి రొయ్యలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి

## - ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి

## - కె. శ్రీనివాస్ డిమాండ్..

**ఏలూరు మే 23 :(నేషనలిస్ట్ వాయిస్)**

రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులు, ఎగుమతి దారులు, మేత తయారీదారులు, దళారులు సిండికేట్ గా మారి రొయ్యల ధరలు తగ్గించి వేసి సాగిస్తున్న దోపిడీని అరికట్టి రొయ్యలకు గిట్టుబాటు ధరలు కల్పించి రొయ్యల రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ డిమాండ్ చేశారు.శనివారం ఏలూరు అన్నే భవనంలో రొయ్యల రైతుల సమస్యలపై ఆయన మాట్లాడారు. గడిచిన 10 రోజుల కాలంలో వివిధ కౌంట్ల రొయ్యల ధరలు రూ.30 నుండి రూ. 40 వరకు తగ్గించి వేయడం వలన ఎకరాకు లక్ష రూపాయలకు పైగారొయ్యల రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 5 లక్షల 75 వేల ఎకరాలలో రొయ్యల సాగు విస్తీర్ణం ఉండగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 2 లక్షల 60 వేల వరకు సాగు విస్తీర్ణం ఉందని చెప్పారు.ఏటా 3 లక్షల టన్నుల రొయ్యల దిగుబడి వస్తుందన్నారు. ఇందులో 30,40 కౌంట్లు ప్రజలు అమెరికాకు, 50 నుండి 100 వరకు ఉన్న కౌంట్ల రొయ్యలు చైనా,యూరోపియన్ దేశాలకు ఎగుమతులు అవుతాయని చెప్పారు. ట్రంప్ సుంకాల వలన, అమెరికా సాగిస్తున్న యుద్ధం వలన రొయ్యల రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మరలా ఇప్పుడు సిండికేట్ వ్యాపారం వలన నష్టపోతున్నారని చెప్పారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆక్వా ఉత్పత్తుల వల్ల వస్తున్న ఆదాయాలను చూసుకుంటున్నాయి గానీ రొయ్యల రైతుల నష్టాలను పట్టించు కోవడం లేదని విమర్శించారు. ఇటీవల రొయ్యల ఫీడ్ ధరలు పెంచేందుకు మేత తయారీ కంపెనీలు ఏకపక్షంగా ప్రయత్నించాయని గుర్తు చేశారు. మరోవైపు నాణ్యమైన సీడ్ గానీ, నాణ్యమైన ఫీడ్ గానీ రైతులకు అందుబాటులో లేదని దీనివలన ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

100 కౌంట్ కిలో రొయ్యల ఉత్పత్తికి రూ.250 కి పైగా ఖర్చు అవుతుందని, ప్రస్తుతం కొనుగోలు చేస్తున్న ధరలు రైతుకు ఏమాత్రం గిట్టుబాటు కాదని, ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకొని ఆక్వా రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. రొయ్యలు రోడ్లపై పారబోసి నిరసనలు తెలియజేయాల్సిన దుస్థితి ఆక్వా రైతులు ఏర్పడిందని, ఇందుకు ప్రభుత్వాల విధానాలే కారణమని విమర్శించారు. పోరాడుతున్న ఆక్వా రైతులకు రైతు సంఘం తరపున సంఘీభావం ప్రకటించారు. ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



# మంగళగిరి టీడీపీ కార్యాలయంలో 'గ్రీవెన్స్' ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## - భూ, ఉపాధి, ఆరోగ్య సమస్యలపై వెల్లువెత్తిన వినతులు

**మంగళగిరి, మే 23 (నేషనలిస్ట్ వాయిస్):**

మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో శనివారం ప్రజా సమస్యల పరిష్కార (గ్రీవెన్స్) కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో పోలవరం ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు పాల్గొని, ప్రజల నుండి నేరుగా వినతిపత్రాలను స్వీకరించారు. రాష్ట్రం లోని వివిధ జిల్లాల నుండి తరలివచ్చిన ప్రజలు తమ బాధలను నేతలకు విన్నవించుకున్నారు. ప్రధానంగా భూ వివాదాలు, రెవెన్యూ సమస్యలు, ఉపాధి అవకాశాలు, వైద్య సహాయం మరియు ఇతర వ్యక్తిగత, సామాజిక సమస్యలపై అర్జీదారులు ఫిర్యాదులు అందజేశారు. బాధితుల సమస్యలను శ్రద్ధగా ఆలకించిన మంత్రి అనగాని, బొరగం శ్రీనివాసులు.. తక్షణమే స్పందించి సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే ఈ కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. "గత ప్రభుత్వ హయాంలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను, వ్యవస్థల్లోని లోపాలను తాము గుర్తించామని.. వాటన్నింటినీ దశలవారీగా పరిష్కరిస్తూ ప్రజలకు న్యాయం చేస్తున్నాం." అని అనగాని సత్యప్రసాద్, రెవెన్యూ శాఖ మంత్రి తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను కేవలం కాగితాలకే



పరిమితం చేయకుండా, క్షేత్రస్థాయిలో పరిశీలించి వీలైనంత వేగంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వారు తెలిపారు. బాధితులకు తక్షణ న్యాయం అందించడంలో ఇలాంటి గ్రీవెన్స్ కార్యక్రమాలు ఎంతో కీలకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, నియోజకవర్గ ప్రతినిధులు, కార్యకర్తలతో పాటు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# జనసేన కార్యకర్తపై దాడి దుర్మార్గం

## : గడ్డమణుగు రవికుమార్, కరాటం సాయి తీవ్ర ఆగ్రహం

## - దొరమామిడిలో క్షతగాత్రుడు మనోహర్‌కు పరామర్శ

## - నిందితుడు పవన్ కుమార్‌పై రౌడీషీట్ తెరవాలని డిమాండ్





**బుట్టాయిగూడెం, మే 23:(నేషనలిస్ట్ వాయిస్)**

సమాజంలో జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించినందుకు జనసేన కార్యకర్తపై భౌతిక దాడికి తెగబడటం అత్యంత హేయమైన చర్య అని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి తీవ్రంగా ధ్వజ మెత్తారు. ఏలూరు జిల్లా బుట్టాయి గూడెం మండలం దొరమామిడి గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త సింగంశెట్టి మనోహర్‌పై ఈనెల 19న జరిగిన దాడిని వారు తీవ్రంగా ఖండించారు. శనివారం బాధిత కార్యకర్త నివాసానికి వెళ్లిన నాయకులు, ఆయనను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన బవిరిశెట్టి పవన్ కుమార్ అనే వ్యక్తి గతంలో గ్రామ పంచాయతీ కార్యదర్శిపై అకారణంగా దాడి చేశాడని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగిపై జరిగిన దాడిని మనోహర్ నిలదీయడమే అతను చేసిన తప్పా? అని ప్రశ్నించారు. ఆ కక్షతోనే పవన్ కుమార్ కర్రతో అమానుషంగా దాడి చేసి మనోహర్‌ను తీవ్రంగా గాయపరిచాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, దాడులకు తెగబడుతున్న నిందితుడు పవన్ కుమార్‌పై వెంటనే పోలీస్ రికార్డుల్లో రౌడీషీట్ ఓపెన్ చేయాలి. కూటమి ప్రభుత్వంలో ఇటువంటి అరాచక శక్తులకు తావులేదు. నిందితుడిపై చట్టప్రకారం కఠినమైన సెక్షన్ల కింద చర్యలు తీసుకోవాలి. అలాగే ప్రజాపక్షాన నిలిచే జనసేన కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ కొండంత అండగా ఉంటుంది. ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కూటమి నాయకులు కోమటి పద్మరాజు, పి. అన్వర్, మండల జనసేన గౌరవాధ్యక్షులు కైకాల సూరిబాబు, కొమరం నాగు (సిపిఐ ఎంఎల్), షేక్ ఇబ్రూ, పి. మంగారావు, మద్దిపాటి శ్రీనివాసరావు సహా పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# చింతలపూడిలో 'ఆపరేషన్ క్లీన్ స్వీప్'

## స్వయంగా చీపురు పట్టిన ఎమ్మెల్యే రోషన్ కుమార్!

### - పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం లభిస్తుంది:

### - ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు





**చింతలపూడి, మే 23:(నేషనలిస్ట్ వాయిస్)**

పరిసరాల పరిశుభ్రతతోనే మానసిక, శారీరక ఆరోగ్యం సిద్ధిస్తుందని చింతలపూడి శాసనసభ్యులు (ఎమ్మెల్యే) రోషన్ కుమార్ పేర్కొన్నారు. శనివారం చింతలపూడి పట్టణంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోషన్ కుమార్ మున్సిపల్ కార్మికులతో కలిసి స్వయంగా రంగంలోకి దిగారు. చేత చీపురు పట్టి రోడ్లను శుభ్రపరుస్తూ, పేరుకుపోయిన చెత్తను డస్ట్ బిన్‌లలో వేస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. పాలకులే స్వయంగా రోడ్లపైకి వచ్చి శ్రమదానం చేయడంతో స్థానిక ప్రజల్లో మరియు సిబ్బందిలో సరికొత్త ఉత్సాహం వ్యక్తమైంది. అనంతరం ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. "స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన చింతలపూడిని నిర్మించడం కేవలం అధికారుల బాధ్యతే కాదు.. ప్రతి పౌరుడి బాధ్యత" అని ఆయన స్పష్టం చేశారు. "చెత్తను రోడ్లపై పడేయకుండా డస్ట్‌బిన్‌లను మాత్రమే ఉపయోగించాలి. ఈ ఆపరేషన్ క్లీన్ స్వీప్ విజయం సాధించాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం. మన ఊరిని మనమే స్వచ్ఛంగా మార్చుకుందాం." అని అన్నారు అలాగే ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు మరియు పెద్ద సంఖ్యలో స్వచ్ఛంద సేవకులు పాల్గొని విజయవంతం చేశారు. ఎమ్మెల్యే చూపిన చొరవపై పట్టణ ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# పేరంపేటరంలో దివ్యాంగుల హక్కుల చట్టంపై అవగాహన సదస్సు





**జంగారెడ్డిగూడెం, మే 23:(నేషనలిస్ట్ వాయిస్)**

ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం పేరంపేటరం గ్రామ సచివాలయంలో శనివారం దివ్యాంగుల హక్కుల చట్టం-2016 పై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. గిడియన్ కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి దివ్యాంగులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షులు ఎస్కే సుభాషిని మాట్లాడుతూ, 2016 చట్టం దివ్యాంగులకు కల్పించిన హక్కులు, రాయితీలు, చట్టపరమైన రక్షణల గురించి సుదీర్ఘంగా వివరించారు. విద్య, ఉపాధి, సామాజిక భద్రత రంగాల్లో దివ్యాంగులకు లభించే 4 శాతం రిజర్వేషన్ గురించి, ప్రభుత్వ పథకాల్లో వారికి దక్కే ప్రాధాన్యత గురించి ఆమె మాట్లాడారు. దివ్యాంగులపై జరిగే వివక్షకు వ్యతిరేకంగా కఠినమైన చట్టపరమైన రక్షణలు ఉన్నాయని పేర్కొన్న ఆమె, అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా 'సదరం' సర్టిఫికెట్ పొందాలని సూచించారు. కార్యక్రమ నిర్వాహకులు గిడియన్ కిషోర్ మాట్లాడుతూ.. సదరం సర్టిఫికెట్ లేనివారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అందించే యూడీఐడీ కార్డు వల్ల కలిగే ప్రయోజనాలను, అలాగే ఏపీఎస్ఆర్‌టీసీ బస్ పాస్ పొందే విధానాన్ని, దానికి కావాల్సిన పత్రాల వివరాలను ఆయన లబ్ధిదారులకు వివరించారు. ఆర్డినరీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో 50 శాతం రాయితీ సదుపాయం ఉందని ఆయన స్పష్టం చేశారు. బోసు మాట్లాడుతూ, దివ్యాంగుల పిల్లల విద్యాభ్యాసం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక పాఠశాలలు, సమీకృత హాస్టళ్లు, అందిస్తున్న స్కాలర్‌షిప్‌ల వివరాలను వెల్లడించారు. 10వ తరగతి వరకు ఉచిత విద్యతో పాటు ఉచిత వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండా దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి, వారిలో మరింత చైతన్యం తేవడానికి ప్రతినెలా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రకటించారు. సదస్సు విజయవంతానికి సహకరించిన గ్రామ సచివాలయ సిబ్బందికి వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ మండల నాయకులు ఎం. జ్యోతి, సచివాలయ సిబ్బంది మరియు స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

# పదో తరగతిలో కొయ్యలగూడెం విద్యార్థుల ఘన విజయం

### - ప్రతిభావంతులను శాలువాతో సన్మానించిన ఎంపీపీ గంజిమాల రామారావు

**కొయ్యలగూడెం, మే 23:(నేషనలిస్ట్ వాయిస్)**

ఈ ఏడాది విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి ఘన విజయం సాధించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కిరణ్ కుమార్, మండల విద్యాశాఖాధికారి సురేష్ బాబుల పర్యవేక్షణ, ఆధ్వర్యంలో ఇక్కడి ప్రభుత్వ బాయ్స్ హైస్కూల్, గర్ల్స్ హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి పాఠశాలల కీర్తిని చాటారు. ముఖ్యంగా కొయ్యలగూడెం గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరిచి మండలంలోనే టాప్‌గా నిలిచారు.

మంచి మార్కులతో విజయం సాధించిన ఈ ముగ్గురు ప్రతిభావంతులైన విద్యార్థులకు కొయ్యలగూడెంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొయ్యలగూడెం మండల పరిషత్ ప్రెసిడెంట్ (ఎంపీపీ) గంజిమాల రామారావు విద్యార్థులను అభినందిస్తూ, వారికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేట్ సంస్థలకు తీసిపోని విధంగా ప్రతిభ చాటడం గర్వకారణమని, రాబోయే రోజుల్లో వీరు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే పాల్గొన్న ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయ బృందం విద్యాశాఖ, స్థానిక ప్రజాప్రతినిధుల



సమన్వయంతో జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, ఎంపీటీసీ గంటా శ్రీను, ఎంపీటీసీ నారా అన్నపురం, ఎంపీటీసీ చింతా శ్రీదేవి, ఎంపీటీసీ జాన్ డేవిడ్ కింగ్ వీరితో పాటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం మరియు స్కూల్ సిబ్బంది అంతా పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థుల ఈ విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

# బాపట్ల పట్టణంలో దేవాలయంలో చోరి

### - హుండీ పగలగొట్టి నగదు ఎత్తుకెళ్లిన దుండగులు

**బాపట్ల : మే 23 (నేషనలిస్ట్ వాయిస్)**

బాపట్ల పట్టణంలోని జీబీసీ రోడ్డు ప్రధాన రహదారిపై ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో అర్ధరాత్రి చోరి జరిగింది. గుర్తు తెలియని దుండగులు దేవాలయంలోకి చొరబడి హుండీని పగలగొట్టి అందులోని నగదును అపహరించారు. శనివారం ఉదయం ఆలయానికి వచ్చిన అర్చకులు హుండీ ధ్వంసమైన పరిస్థితి గమనించి వెంటనే భక్తులకు,పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించి విచారణ చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజ్ ను పరిశీలించారు. దుండగులు ఎంత మొత్తం నగదు ఎత్తుకెళ్లారన్నది ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దుండగులను త్వరగా పట్టుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.







# పట్టిసంలో వైఎస్సార్‌సీపీ నాయకుడి కుటుంబానికి పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పరామర్శ

**పోలవరం మే 23(నేషనలిస్ట్ వాయిస్)**

ఏలూరు జిల్లా పోలవరం మండలం పట్టిసం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తెలగంశెట్టి సూర్య చంద్రం సతీమణి తెలగంశెట్టి నాగమణి ఇటీవల స్వర్గస్తులయ్యారు. ఈ విషయం తెలుసుకున్న పోలవరం మాజీ శాసనసభ్యులు తెల్లం బాలరాజు శనివారం వారి నివాసానికి చేరుకుని నాగమణి భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం సూర్య చంద్రం మరియు వారి కుటుంబ సభ్యులను కలిసి, తన గాఢ సానుభూతిని తెలియజేస్తూ వారిని ఓదార్చారు. మాజీ ఎమ్మెల్యేతో పాటు ఏలూరు జిల్లా ఎంపీపీ ఛాంబర్ అధ్యక్షులు, పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి కూడా బాధిత కుటుంబాన్ని పరామర్శించి, అధైర్యపడవద్దని ధైర్యం చెప్పారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి వైఎస్సార్‌సీపీ నాయకులు, భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొని మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.



# పవన్‌తో పోలవరం ఎమ్మెల్యే భేటీ

### నియోజకవర్గ అభివృద్ధి తదితరాలపై చర్చ

### అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేయాలని సూచన

**అమరావతి,మే23 (నేషనలిస్ట్ వాయిస్):**

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా.. పోలవరం ఎమ్మెల్యేగా ఆయన పని తీరుపై డిప్యూటీ సీఎం సమీక్ష నిర్వహించారు. పోలవరం నియోజకవర్గం పరిధికి సంబంధించి పార్టీ దృష్టికి వచ్చిన విషయాలు, ఆరోపణలపై ఎమ్మెల్యేను పవన్ వివరణ అడిగినట్లు తెలుస్తోంది. తన వ్యక్తిగత విషయాలను కుటుంబ సభ్యులతో కలిసి కూర్చొని చక్కదిద్దుకొనేందుకు కొంత గడువు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరగా.. నాలుగు వారాల్లోగా చక్కదిద్దుకోవాలని పవన్ సూచించినట్లు సమాచారం. పోలవరం నియోజకవర్గంలో పంచాయతీల్లో అభివృద్ధి పనులకు ఇప్పటి వరకు రూ. 147 కోట్లు కేటాయించారు. ఆ పనుల పురోగతిపైనా డిప్యూటీ సీఎం సమీక్ష చేశారు. పనుల సకాలంలో వేగంగా పూర్తి చేయకపోవడంపై పవన్ ప్రశ్నించారు. అధికారులను చక్కదిద్దుకోవాలని సూచించినట్లు సమాచారం.

# బక్రీద్ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మే 23 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)

జూన్ 28న జరగనున్న బక్రీద్ పండుగ సందర్భంగా చేపట్టాల్సిన పారిశుద్ధ్య, ఆరోగ్య ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ డా..సత్య శారదా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి డీఆర్వో విజయలక్ష్మి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా. బాలకృష్ణ, నర్సంపేట ఆర్డీవో ఉమ, డీఎండబ్ల్యూఓ రమేష్, డీఎంహెచ్‌వో, డీపీఓ, జీడబ్ల్యూఎంసీ హెల్త్ ఆఫీసర్ రాజేష్, డీసీసీ అధ్యక్షులు మహ్మద్ అయూబ్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ బక్రీద్ పండుగ నేపథ్యంలో ముఖ్యంగా వరంగల్ ఈస్ట్ పరిధిలోని కాలనీలలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ ట్రాక్టర్లను విభజించి ఇంటింటికీ జంతు అవశేషాలను సక్రమంగా సేకరించే విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే సేకరించిన వ్యర్థాలను సకాలంలో తొలగించే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బక్రీద్ పండుగను శాంతి యుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య సేవలు తదితర అంశాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ ఖిలా వరంగల్ తాసిల్దార్లు శ్రీకాంత్, ఇక్బాల్, సంబంధిత అధికారులు మత పెద్దలు పాల్గొన్నారు.





# పశ్చిమాసియాలో సడలని ఉద్రిక్త పరిస్థితులు

## ఇరాన్‌పై దాడులకు అమెరికా సన్నద్ధమైనట్లుగా వార్తలు

## తమ గగన తలాన్ని మూసేస్తూ ఇరాన్ ఆదేశాలు

టెహ్రాన్,మే23 (నేషనలిస్ట్ వాయిస్)

పశ్చిమాసియాలో పరిస్థితులు ఎప్పటికప్పుడు మారిపోతున్నాయి. ఓవైపు చర్చలు కొనసాగుతుండగానే.. ఇరాన్‌పై మరోసారి దాడికి దిగేందుకు అమెరికా సన్నద్ధమవుతుందంటూ వార్తలు వెలువడ్డాయి. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ తన గగనతలాన్ని మూసివేసింది. దేశంలోని పశ్చిమ ప్రాంతం వైపున్న గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ఇరాన్ పౌర విమానయాన సంస్థ విమానయాన సిబ్బందికి నోటమ్ జారీ చేసింది. ఈనెల 25 వరకు అన్ని విమానాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు తెలిపింది. ఈ నోటమ్ జారీ చేసే సమయంలో ఖతార్ ప్రభుత్వానికి చెందిన ఓ వీఐపీ విమానం ఇరాన్ గగనతలాన్ని దాటింది. ఆ విమానం శాంతి ఒప్పందానికి సంబంధించిన చర్చల కోసం టెహ్రాన్‌కు వచ్చిన ఖతార్ ప్రతినిధి బృందానికి చెందినదిగా తెలుస్తోంది. ఇక, అమెరికా- ఇరాన్ మధ్య చర్చలు తుది దశకు చేరుకున్నాయని, ఒప్పందానికి సంబంధించిన చాలా అంశాల్లో ఇరుదేశాల మధ్య సయోధ్య కుదిరినట్లు తెలుస్తోంది. దీంతో ఏ క్షణమైనా ఒప్పంద ప్రకటన వెలువడే అవకాశముంది. అదే సమయంలో ఈ దౌత్య ప్రయత్నాలు చివరి నిమిషంలో విఫలమైతే.. టెహ్రాన్‌పై మళ్లీ దాడులు చేసే విషయాన్ని అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో ఇరాన్ కూడా తన గగనతలాన్ని మూసివేయడంతో.. పశ్చిమాసియాలో ఏ క్షణాన ఏం జరుగుతుందోననే భయాందోళనలు నెలకొన్నాయి. అమెరికా మరోసారి దాడులకు సిద్ధం అవుతోందన్న వార్తల నేపథ్యంలో ఇరాన్ ఇలా అప్రమత్తమైంది. ఈ పరిణామంతో గల్ఫ్‌లో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. యూఎస్ మరోసారి యుద్ధాన్ని ప్రారంభించిన పక్షంలో దీటుగా ఎదుర్కొనేందుకు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్, ఇతర సాయుధ దళాలు సిద్ధమవుతున్నట్టు ఇరాన్ వార్తా సంస్థ తస్నిమ్ ఒక కథనాన్ని ప్రచురించింది. అమెరికా ఆస్తులకు నష్టం కలిగేలా, ప్రయోజనాలు దెబ్బతినేలా దాడులకు ప్రణాళికలను ఇరాన్ మిలిటరీ సిద్ధం చేసినట్టు సమాచారం. ఈ వారాంతాన్ని న్యూజెర్సీలో గడపాల్సిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చివరి నిమిషంలో తన ప్లాన్స్‌ను అకస్మాత్తుగా రద్దు చేసుకుని రాజధాని వాషింగ్టన్‌కు తిరిగొచ్చారు. దీంతో, పశ్చిమాసియాలో మళ్లీ ఘర్షణలు మొదలవుతాయన్న వార్తలు మీడియాలో వెలువడ్డాయి. ఈ వారాంతంలో మెమోరియల్ డే వేడుకల్లో పాల్గొనాల్సిన అమెరికా నిఘా సంస్థల సీనియర్ అధికారులు కూడా తమ ప్రణాళికలను రద్దు చేసుకుని వాషింగ్టన్‌కు తిరిగొచ్చేశారు. రాబోయే 24 గంటల్లో దౌత్యపరమైన పురోగతి లేని పక్షంలో దాడులు మొదలుపెట్టేందుకు ట్రంప్ కూడా సుముఖంగానే ఉన్నట్టు స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. పరిస్థితులు అంతకంతకూ ఉద్రిక్తంగా మారుతున్నా తెరవెనుక దౌత్యమార్గాల్లో ప్రయత్నాలు ముమ్మర స్థాయిలో జరుగుతున్నట్టు కూడా తెలుస్తోంది. చర్చల్లో కొంత పురోగతి కనిపించిందని విశ్వసనీయ వర్గాలు చెప్పినట్టు తస్నిమ్ వార్తా సంస్థ పేర్కొంది.

# పర్సంటేజీ అయితనే సినిమా ఆడుద్ది


## పెద్ది సినిమా నుంచే మొదలు పెడదాం

## రెంటల్ సిస్టమ్ కాలం చెల్లిన విధానం

## తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్

హైదరాబాద్,మే24 (నేషనలిస్ట్ వాయిస్)





తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. పెద్ది సినిమా విడుదల చేయాలంటే తమకు పర్సెంటేజ్ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసింది. ఇకపై ఏ సినిమా అయినా పర్సంటేజ్ కావాలని తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ తేల్చి చెప్పింది. శనివారం తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ.. 'తెలుగు ఫిల్మ్ ఛాంబర్ కమిటీతో రెండు, మూడు సార్లు చర్చలు జరిగాయి. హరిహర వీరమల్లు రిలీజ్ సమయంలో.. రెండు నెలల్లో మా సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. 'కానీ, సంవత్సరం గడిచిపోయింది. పెద్ది సినిమాకు మాకు పర్సంటేజ్ కావాల్సిందే. మమ్మల్ని నిర్మాతలు రెచ్చగొడుతున్నారు. మొదట మూడు వారాలు అన్నారు.. ఇప్పుడు ఆరు వారాలు అంటున్నారు. పర్సెంటేజ్ సిస్టమ్ అయితేనే సినిమాలు ఆడిస్తాము. 120 మంది థియేటర్స్ ఓనర్లు దీనస్థితిలో ఉన్నారు. పర్సంటేజ్ సిస్టంను కావాలనే నిర్మాతలు లేట్ చేస్తున్నారు. మాకు పర్సెంటేజ్ విధానం కావాల్సిందే. అది ఎంత ఇస్తారో చెప్పండి. 10,15 ఏళ్ల కింద థియేటర్స్‌కి మంచి రెవెన్యూ ఉండేది. ఇప్పుడు ఎగ్జిబిటర్స్‌కి రెవెన్యూ రావడం లేదు. కానీ, నిర్మాతలకు 14 రకాలుగా ఆదాయం వస్తోంది'..పర్సంటేజ్ విధానం కొత్త విషయం కాదు. అన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే ఉంది. కాబట్టి కూర్చుని పర్సంటేజ్‌ను తేల్చండి. అన్ని సినిమాల రిలీజ్ సాఫీగా జరుగుతుంది. మీటింగ్‌లో కూడా పర్సంటేజ్‌కు సైన్ చేస్తేనే పెద్ది రిలీజ్‌కు ఒప్పుకుంటామని చెప్పాము. సబ్ కమిటీలో మెంబర్స్‌గా ఉండి.. మాకు కావలసిన పర్సంటేజ్‌ను సాధించుకుంటాం. మెగాస్టార్ చిరంజీవి పిలిస్తే వెళతాం. పెద్దమనిషికి మా బాధలు చెప్పుకుంటాం. పర్సంటేజ్ సిస్టమే ఉండాలి. రెంటల్ మాట వద్దు' అని అన్నారు.

# బెంగుళూరులో కాక్రోచ్ జనతా పార్టీ

## నేడు మానవహారం అంటూ వెలసిన పోస్టర్లు

## అలాంటిదేమీ లేదంటూ పోలీసుల కొట్టివేత

బెంగళూరు,మే23 (నేషనలిస్ట్ వాయిస్)

సోషల్ మీడియాలో సంచలనం సృష్టించిన 'బొద్దింకల జనతా పార్టీ' పేరుతో మే 24న బెంగళూరులో మానవహారం నిర్వహించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. 'బొద్దింకల జనతా పార్టీ కర్ణాటక' పేరుతో విడుదలైన పోస్టర్‌లో టౌన్ హాల్ సమీపంలో శాంతియుత మానవహారం చేపడతామని పేర్కొన్నారు. 'బొద్దింకల శక్తి ఆన్‌లైన్‌లోనే కాదు, వీధుల్లో కూడా ఉంది' అని పోస్టర్‌లో పేర్కొనడం చర్చనీయాంశమైంది. అయితే ఈ కార్యక్రమానికి ఎలాంటి అనుమతి ఇవ్వలేదని బెంగళూరు పోలీసులు స్పష్టం చేశారు. మానవహారం నిర్వహించేందుకు ఏ వ్యక్తి, సంస్థ లేదా రాజకీయ పార్టీ నుంచి ఇప్పటివరకు దరఖాస్తు రాలేదని తెలిపారు. టౌన్ హాల్ పరిసరాల్లో అనుమతి లేకుండా గుమికూడవద్దని, సోషల్ మీడియాలో ఈ కార్యక్రమానికి సంబంధించిన సందేశాలను షేర్ చేయవద్దని హెచ్చరించారు. నిరుద్యోగ యువతను బొద్దింకలతో పోలుస్తూ ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలపై వ్యంగ్యంగా స్పందిస్తూ 'బొద్దింకల జనతా పార్టీ' పేరుతో సోషల్ మీడియాలో ప్రచారం ప్రారంభమైంది. ఈ పేరుతో ప్రారంభమైన ఎక్స్ ఖాతా కొద్ది రోజుల్లోనే వైరల్‌గా మారింది. అనంతరం ఆ ఖాతా నిలిపివేయబడినప్పటికీ, ఇన్‌స్టాగ్రామ్‌లో సీజేపీకి భారీ స్థాయిలో ఆదరణ లభించింది. కొద్ది రోజుల్లోనే సీజేపీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా 1.85 కోట్ల ఫాలోవర్లను సంపాదించి, ప్రధాన రాజకీయ పార్టీల అధికారిక పేజీలను అధిగమించింది. పుణెకు చెందిన అభిజీత్ దీప్కే అనే యువకుడు ఈ ఖాతాను ప్రారంభించారు. ఖాతా నిలిపివేసిన తరువాత తనకు ప్రాణహాని బెదిరింపులు వస్తున్నాయని ఆయన తెలిపారు.

# బక్రీద్ సెలవు 28కి మార్పు ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

హైదరాబాద్,మే24 (నేషనలిస్ట్ వాయిస్)

తెలుగు రాష్ట్రాల్లో బక్రీద్(ఈద్ అల్-అధా) పండుగ తేదీ మారింది. దుల్ హిజ్జా నెలవంక దర్శనం ఆలస్యం కావడంతో మే 28న బక్రీద్ సెలవు దినంగా ప్రకటిస్తూ ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీచేశాయి. దీంతో ఆ రోజున అన్ని ప్రభుత్వ కార్యాలయాలు సహా విద్యాసంస్థలు, బ్యాంకులకు సెలవు ఉండనుంది. అయితే.. చంద్రుని దర్శనం ఆధారంగా సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లలో మాత్రం ఈ నెల 27న(బుధవారం) ఈ పండుగను జరుపుకోనున్నారు. తొలుత ప్రకటించిన దాని ప్రకారం.. మే 27న ఉండగా, దానిని మే 28 గురువారం నాటికి మారుస్తూ ఇరు తెలుగు రాష్ట్రాలు అధికారిక ఉత్తర్వులు జారీచేశాయి. వాస్తవానికి ముస్లింలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే పవిత్రమైన పండుగ బక్రీద్.. ఇస్లామిక్ క్యాలెండర్‌లోని చివరి నెల అయిన దుల్-హిజ్జా 10వ రోజు వస్తుంది. ఆ ప్రకారం ముస్లిం పండుగలు చంద్రదర్శనంపై ఆధారపడి ఉంటాయి. అయితే.. ఈసారి దుల్ హిజ్జా నెలవంక దర్శనం ఒకరోజు ఆలస్యం కావడంతో పండుగ తేదీ మారినట్టు మతపెద్దలు ప్రకటించారు.తెలంగాణ వక్ఫ్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, మైనారిటీ సంక్షేమ శాఖల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, సిఫార్సులను పరిశీలించిన ప్రభుత్వం పండుగ సెలవును 28కి మార్చింది. మే 28న సాధారణ సెలవు దినంగా జారీచేశారు.

# మాసాబ్ ట్యాంక్‌లో దారుణ ఘటన

## - న్యాయవాదిని కారుతో ఢీకొటంటి

## చంపిన దుండుగుల

## - కారు నంబర్ ఆధారంగా పోలీసుల దర్యాప్తు

హైదరాబాద్,మే23 (నేషనలిస్ట్ వాయిస్)

హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ ప్రాంతంలో న్యాయవాది ఖాజా మొహియుద్దీన్‌పై ప్రత్యర్థులు దాడికి తెగబడ్డారు. శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చిన న్యాయవాదిని దుండగులు కారుతో బలంగా ఢీకొట్టారు. పక్కా ప్లాన్‌తో న్యాయవాది కోసం వేచి చూస్తున్న దుండగులు.. ఖాజా మొహియుద్దీన్ బయటకు వచ్చిన వెంటనే అత్యంత వేగంగా వచ్చి ఢీకొట్టి పరారయ్యారు. కారు ఢీకొట్టిన వెంటనే న్యాయవాది గాల్లోకి ఎగిరి కిందపడ్డారు. దీంతో ఆయనకు తీవ్రమైన గాయాలయ్యాయి. వెంటనే గమనించిన కుటుంబసభ్యులు.. మొహియుద్దీన్‌ను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు.అయితే ఆయన అప్పటికే మృతి చెందారు. న్యాయవాదిపై హత్యాయత్నం దృశ్యాలు సీసీటీవీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. న్యాయవాదిపై దాడి సమాచారం తెలుసుకున్న తోటి న్యాయవాదులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాజా మొహియుద్దీన్‌ను కారుతో ఢీకొట్టిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఇది న్యాయవ్యవస్థపైనే దాడి అని వారు అభివర్ణించారు. ఈ ఘటనపై నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. న్యాయవాదిపై దాడికి గల కారణాలు, ఆయనపై ఎవరు దాడి చేశారనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కారు నంబర్ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఇకపోతే మాసబ్‌ట్యాంక్ వద్ద కారు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డ న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ కన్నుమూశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ న్యాయవాది తుదిశ్వాస విడిచారు. న్యాయవాది తన కారు వద్దకు వచ్చి వెనక సీట్లో బ్యాగు పెట్టి.. డ్రైవింగ్ సీట్‌లో కూర్చోబోతున్న సమయంలో ఒక్కసారిగా దుండగులు కారుతో అతివేగంగా దూసుకొచ్చి బలంగా ఢీకొట్టారు. క్షణాల్లోనే ఈ ఘటన చోటు చేసుకుంది. న్యాయవాదికి తీవ్రమైన గాయాలవడంతో వెంటనే కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే న్యాయవాది పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. చివరకు చికిత్స పొందుతూ మొయినుద్దీన్ ప్రాణాలు కోల్పోయారు. సీసీటీవీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు.. కారు నంబర్ ఆధారంగా నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

# బెంగాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం

## - వివాదాస్పద ఫుట్‌బాల్

## శిల్పం కూల్చివేత

కోల్‌కతా,మే24 (నేషనలిస్ట్ వాయిస్)

కోల్‌కతాలోని ప్రఖ్యాత సాల్ట్ లేక్ స్టేడియం వీవీఐపీ గేటు వెలుపలనున్న వివాదాస్పద ఫుట్‌బాల్ శిల్పాన్ని శనివారం ఉదయం కూల్చివేశారు. పశ్చిమబెంగాల్ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫుట్‌బాల్ శిల్పం కూల్చివేత జరిగినట్టు అధికారులు తెలిపారు. సాల్ట్ లేక్‌లోని వివేకానంద యుబ భారతి క్రీరాంగణ్ గా పేరున్న ఈ స్టేడియం పునరుద్ధరణ కార్యక్రమం 2017లో జరిగింది. ఆ సమయంలో ఫుట్‌బాల్ శిల్పాన్ని ఏర్పాటు చేశారు. నాటి ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పర్యవేక్షణలో ఈ శిల్పం ఏర్పాటైంది. నడుము వరకూ ఉన్న కాళ్లు, దానిపై ఫుట్‌బాల్, బిశ్వబంగ్లా లోగోతో ఈ శిల్పం నిర్మించారు. అయితే ఈ నిర్మాణం కళాత్మకంగా లేదని, అసహ్యకరమైన ఆకృతిలో అర్థరహితంగా ఉందనే విమర్శలు రావడంతో దానిని తెలగించాలనే నిర్ణయం తీసుకున్నట్టు రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి నితీష్ ప్రమాణిక్ ఇటీవల ప్రకటించారు. ఆయన మే 17న స్టేడియంలో జరిగిన 'మోహన్ బగాన్ ఈస్ట్ బెంగాల్ డెర్బీ'కి హాజరయ్యారు. మ్యాచ్ అనంతరం ఫుట్‌బాల్ శిల్పం రూపకల్పనపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఆ శిల్పం పెట్టినప్పటి నుంచి గత పాలకుల పరిస్థితి తిరగబడిందని చాలామంది అభిప్రాయపడినట్టు చెప్పారు.కాగా, ప్రజాపనుల శాఖ సీనియర్ అధికారులతో సంప్రదింపుల తర్వాతే ఫుట్‌బాల్ శిల్పాన్ని తొలగించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకున్నట్టు క్రీడాశాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. పశ్చిమబెంగాల్‌లోని ఫుట్‌బాల్ ఫ్యాన్స్‌కు సాల్ట్ లేక్ స్టేడియంతో విడదీయరాదని అనుబంధం ఉందన్నారు. సౌందర్యం, సాంస్కృతిక ప్రాధాన్యాలు మేళవించి ఫుట్‌బాల్ క్రీడకు చెందిన ల్యాండ్‌మార్క్ ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉందని చెప్పారు. పాత శిల్పం స్థానే ప్రఖ్యాత ఫుట్‌బాల్ క్రీడాకారుని విగ్రహం ఏర్పాటు చేసేందుకు చర్చలు జరుగుతున్నాయని అన్నారు. పశ్చిమబెంగాల్ ఫుట్‌బాల్ వారసత్వం, యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచే సింబల్‌ను తామంతా కోరుకుంటున్నామని చెప్పారు.

# భారతదేశానికి ఆత్మ ప్రాణము హిందూ ధర్మం..

## - శంకర్ స్వామి జీ..







దేవరకద్ర మే 23 నేషనలిస్ట్ వాయిస్

నేటి సమాజంలో భారతదేశానికి ఆత్మ ప్రాణము హిందూ ధర్మం అని మాణికేశ సంస్థానం తెలంగాణ సాధు పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు శంకర్ స్వామీజీ అన్నారు. దేవరకద్ర మండల కేంద్రంలో శనివారం రాత్రి స్థానిక శ్రీనివాస ఫంక్షన్ హాల్ లో హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ సంస్కృతి మరియు హిందూ సమాజం అటువంటి హిందూ సమాజాన్ని చైతన్యం చేయాలని ఆయన కోరారు. కొన్ని రాష్ట్రాలలో హిందూ దేవాలయాల పైన దాడులు చేస్తున్నారని అలాంటి వారిపై తిరగబడేందుకు ప్రతి ఒక్కరు కూడా సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజంలో సనాతన ధర్మాన్ని కూడా పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది అని ఆయన అన్నారు. అందుకు ప్రతి ఒక్కరు కూడా హిందూ ధర్మాన్ని పాటించాలని ఆయన కోరారు. తదుపరి వారిని శాలువాతోసన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది సామాజిక కార్యకర్త మౌనిక సుంకర, సంస్కార భారతి ప్రాంత సంఘటన మంత్రి జమాల్ పూర్ నిరంజన్, నియోజకవర్గ బిజెపి ఇన్చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి, ఆంజనేయులు సుధాకర్ రెడ్డి తిప్పారెడ్డి చంద్రయ్య భాస్కర్ సంతోష్ రఘువీర్ నరేష్ కొండ శ్రీనివాస్ రెడ్డి మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పల్లి గింజతో ప్రాణాపాయం...

## నిమిషాల్లో చిన్నారి ప్రాణాలు కాపాడిన ఎస్వీఎస్ వైద్యులు..

దేవరకద్ర మే 23 నేషనలిస్ట్ వాయిస్

ఆడుకుంటూ నోట్లో పెట్టుకున్న పల్లి గింజ శ్వాసనాళంలో ఇరుక్కొని ప్రాణాపాయ స్థితికి చేరుకున్న రెండేళ్ల బాలుడికి మహబూబ్‌నగర్‌లోని ఎస్వీఎస్ మెడికల్ కాలేజ్ హాస్పిటల్ వైద్యులు అత్యవసర చికిత్స అందించి శనివారం ప్రాణాలు కాపాడారు. నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్‌కు చెందిన అర్జున్ అనే బాలుడు పల్లీలు తింటుండగా ఒక గింజ శ్వాసనాళంలోకి జారిపోవడంతో తీవ్ర శ్వాసకోశ ఇబ్బందులకు గురయ్యాడు. వెంటనే స్థానిక చిన్నపిల్లల వైద్యుడిని సంప్రదించగా ఆక్సిజన్ స్థాయి ప్రమాదకరంగా తగ్గిందని, హైదరాబాద్‌కు తరలించాలని సూచించారు. అయితే కుటుంబం ఆర్థికంగా బలహీనంగా ఉండటంతో బాలుడిని మహబూబ్‌నగర్‌లోని ఎస్వీఎస్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడ చిన్నపిల్లల వైద్యులు ప్రొఫెసర్ సోరెన్ బాలుడిని పరీక్షించి వెంటనే వెంటిలేటర్‌పై ఉంచి ఊపిరితిత్తుల విభాగ వైద్యులను అప్రమత్తం చేశారు. కొన్ని గంటలపాటు చికిత్స అనంతరం అత్యవసర శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. ఊపిరితిత్తుల విభాగ ప్రొఫెసర్ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో అత్యాధునిక రిజిడ్ బ్రాంకోస్కోపీ విధానంతో కేవలం రెండు నిమిషాల్లో శ్వాసనాళంలో ఇరుక్కున్న పల్లి గింజను తొలగించారు. అనంతరం వెంటిలేటర్‌ను తొలగించగా బాలుడు కోలుకున్నాడు. మత్తుమందు వైద్యులు ప్రొఫెసర్ ఆయాతుల్ల ఆధ్వర్యంలో ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించారు. చికిత్సలో ఊపిరితిత్తుల పీజీ వైద్యులు డా. స్వాతి, డా. అజిత్‌రెడ్డి, డా. బలరామ్, చిన్నపిల్లల



విభాగానికి చెందిన డా. కారుణ్య కీలక పాత్ర పోషించారు. మత్తుమందు విభాగ పీజీలు డా. సౌమ్య, డా. అహ్మద్, డా. చిన్మయి రెడ్డి, డా. మానస, అలాగే డా. నిక్షిత్ కూడా పాల్గొన్నారు. బాలుడి ప్రాణాలు కాపాడిన వైద్య బృందాన్ని ఆసుపత్రి యాజమాన్యం, ఊపిరితిత్తుల విభాగాధిపతి డా. ప్రద్యుత్ వాగ్రే, ప్రొఫెసర్ కోటేశ్వరరావు, మెడికల్ సూపరింటెండెంట్ డా. హరిప్రసాద్ రెడ్డి, ఆర్‌ఎంఓ డా. వేణు అభినందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన బాలుడి తల్లిదండ్రులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# నియోజకవర్గంలోని 11 క్లస్టర్లలో ఘనంగా మహానాడు కార్యక్రమం

## తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి)

తాడేపల్లిగూడెం ప్రతినిధి మే 23 (నేషనలిస్ట్ వాయిస్)

నెల్లూరులో ఈ నెల 27,28,29 తేదీల్లో నిర్వహించాల్సిన తెదేపా మహానాడును పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు రద్దు చేసిన విషయాన్ని తెదేపా నియోజకవర్గ ఇంచార్జ్ , భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) గుర్తుచేశారు. స్థానిక తెదేపా కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెదేపా కార్యనిర్వహణ అధ్యక్షుడు నారా లోకేష్, పోలిట్ బ్యూరో సభ్యుల ఆధ్వర్యంలో మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో వర్చువల్ విధానంలో మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని తెలిపారు. టిడిపి కేంద్ర కార్యాలయం ఆదేశాలు మేరకు తెదేపా జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు ఆధ్వర్యంలో తాడేపల్లి గూడెం నియోజక వర్గ పరిధిలోని 11 క్లస్టర్ లో మహానాడు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. మహానాడు కార్యక్రమంలో పార్టీ కష్టకాలంలో పనిచేసిన కార్యకర్తలకు, నాయుకులకు సన్మానాలు, వేడుకలు నిర్వహించనున్నామని తెలియజేశారు. క్లస్టర్ 1 మద్దిపేట సత్యనారాయణ ఆధ్వర్యంలో జెవిసి కన్వెన్షన్ హాలు నీలాద్రిపురం, క్లస్టర్ 2 వట్టూరి రాంబాబు ఆధ్వర్యంలో చైనా తాడేపల్లిలోని వెలమ కళ్యాణ మండపంలో, క్లస్టర్ 3 శనగన శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో సూర్య కోట్ల ఫంక్షన్ హాల్ ఎల్.అగ్రహారం, క్లస్టర్ 4 మిద్దె కనకారావు ఆధ్వర్యంలో పెద తాడేపల్లిలోని గాయత్రి ఫంక్షన్ హాల్ లోను, క్లస్టర్ 5 కిలపర్తి వెంకటరావు ఆధ్వర్యంలో పెటపాడులోని వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలోను, క్లస్టర్ 6 గారపాటి భాస్కరరావు ఆధ్వర్యంలో మీనవల్లూరులోని పాతూరి ఫౌండేషన్ హాల్లోనూ, క్లస్టర్ 7 గంధం సతీష్ ఆధ్వర్యంలో బోనం ధనలక్ష్మి హాల్లోనూ, క్లస్టర్ 8 ఎరుబండి సతీష్ ఆధ్వర్యంలో బలుసులమ్మ కళ్యాణమండపం 1లోను, క్లస్టర్ 9 దాట్ల జగన్నాథ రాజు ఆధ్వర్యంలో బలుసులమ్మ కళ్యాణ మండపం 2 లోను, క్లస్టర్ 10 గొర్ల శ్రీధర్ ఆధ్వర్యంలో గొర్రెల సూరన్న కళ్యాణ మండపంలోను, క్లస్టర్ 11 కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నామని తెలిపారు. ఈ




కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఎంపిటిసి, జడ్పిటిసిలు సభ్యులు, మాజీ సర్పంచులు, కార్యకర్తలు నాయుకులు పాల్గొని మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# కుమారుడు ట్రంప్ జూనియర్ వివాహం

## - ప్రస్తుత పరిస్థితుల్లో హాజరు కాలేనన్న ట్రంప్

వాషింగ్టన్,మే23 (నేషనలిస్ట్ వాయిస్)

ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలో జరగనున్న తన పెద్ద కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ వివాహానికి తాను హాజరుకాక పోవచ్చని పేర్కొన్నారు. ఆ వేడుకకు హాజరైనా.. హాజరుకాకపోయినా తప్పుడు వార్తలతో తనను చంపేస్తారని చమత్కరించారు. అందుకే వివాహానికి హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని.. అయితే ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలు, భద్రతాపరమైన ఆందోళనల నేపథ్యంలో అది కష్టంగా మారే అవకాశం ఉందని తెలిపారు. 48 ఏళ్ల డొనాల్డ్ ట్రంప్ జూనియర్ ఈ వారాంతంలో తన ప్రియురాలు బెట్టినా ఆండర్సన్‌ను వివాహం చేసుకోనున్నారు. ఈ వేడుక బహమాస్‌లో జరగనుంది. భద్రతా కారణాల దృష్ట్యా ఈ వివాహానికి సన్నిహితులను మాత్రమే ఆహ్వానిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ట్రంప్ జూనియర్ 2005లో వెనెసాను వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత వీరి మధ్య విభేదాలు రావడంతో 13 ఏళ్ల తమ వైవాహిక బంధానికి స్వస్తి పలుకుతూ 2018లో విడాకులు తీసుకున్నారు. వీరికి ఐదుగురు సంతానం. 2020లో ట్రంప్ జూనియర్‌కు ఫాక్స్‌న్యూస్ మాజీ హోస్ట్ కింబర్లీతో నిశ్చితార్థం జరగ్గా.. తర్వాత దానిని రద్దు చేసుకున్నారు. అనంతరం మోడల్, సామాజికవేత్త అయిన బెట్టినా ఆండర్సన్‌తో ట్రంప్ జూనియర్ గతేడాది ఎంగేజ్‌మెంట్ చేసుకున్నారు.

# ముగిసిన తెలంగాణ ప్రజానాట్యమండలి 4 వ జిల్లా మహాసభ.

ప్రజానాట్యమండలి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా వెన్నెల వెంకన్న...

హర్షం వ్యక్తం చేసిన జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు,

మండలల కార్యదర్శులు పోలేపల్లి ఉదయ్ కుమార్ జిల్లా యాదగిరి.

మిర్యాలగూడ నేషనలిస్ట్ వాయిస్ మే 23.



కళ కళ కోసం కాదని కళ ప్రజల కోసం ప్రజా చైతన్యం కోసం కృషి చేయాలని ప్రజానాట్యమండలి నాటి నుండి నేటి వరకు ఎంతో మంది కళాకారులను తయారు చేసిందని సిపిఐ జిల్లా కార్య వర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు గుర్తు చేశారు. శనివారం తెలంగాణ ప్రజానాట్య మండలి నాలుగవ జిల్లా మహాసభ నల్లగొండ సిపిఐ పార్టీ కార్యా యం లో ఘనంగా జరిగింది. ఈ మహాసభలలో మిర్యాల గూడ కి చెందిన వెన్నెల వెంకన్నను ప్రజానాట్య మండలి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా. ఎన్నికకు సహకరించిన నల్లగొండ జిల్లా సిపిఐ కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కే శ్రీనివాసులు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి శ్రవణ్ కుమార్ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు వీరికి ప్రత్యేకమైన విప్లవాభినందనలు తెలియజేశారు. పార్టీ ప్రజానాట్య మండలి నాయకులు నా మీద పెట్టినటువంటి ఈ గురుతరమైనటువంటి బాధ్యతను నిర్వహిస్తూ పార్టీ ఆదేశాల ప్రకారం నిరంతరం కృషి చేయాలి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో తెలంగాణ ప్రజానాట్యమండలి మిర్యాలగూడ ప్రాంతంలో విస్తరించినందుకు నా వంతుగా కృషి చేస్తానని మే 25 26 తేదీల్లో హైదరాబాద్ నారాయణగూడ లో జరగబోయే ప్రజానాట్యమండలి రాష్ట్ర నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలను జయప్రదం చేసేందుకు అన్ని వర్గాల కళాకారులందరూ ముందుకు రావాలని వారు విజ్ఞప్తి చేశారు. కళాకారుల సమస్యలపై పోరాటాలు నిర్వహించి కళాకారులకు జిల్లా కేంద్రాలలో మినీ రవీంద్ర భారతి నిర్మించాలని 6000 పెన్షన్ కళాకారులకు ప్రయాణానికి ఆర్టీసీ బస్సుల్లో రైళ్లు రాయితీలు కల్పించాలని కళాకారులను దేవాలయాల్లో కళా ప్రదర్శనలకు అవకాశం కల్పించాలని నియోజకవర్గానికి ఒక మినీ ఆడిటోరియం నిర్మించాలని కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు సాంస్కృతిక కార్యక్రమాల్లో కళాకారులకు అవకాశం కల్పించాలని ఇలాంటి అనేక డిమాండ్లతో ఈ మహాసభ లో తీర్మానాలు చేసి కళాకారులను భవిష్యత్తు పోరాటాల వైపు నడిచే విధంగా చైతన్యం చేస్తామని అన్నారు.

# బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలి

## : పరిగి డీఎస్పీ శ్రీనివాస్

పరిగి (నేషనలిస్ట్ వాయిస్, ప్రతినిధి) మే 23

బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని పరిగి డీఎస్పీ శ్రీనివాస్ సూచించారు. బక్రీద్ పండుగ సందర్భంగా పరిగి పోలీస్ స్టేషన్‌లో శనివారం జరిగిన పీస్ కమిటీ సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ...పండుగలను శాంతియుత వాతావరణంలో, సామరస్య భావంతో జరుపుకోవాలని సూచించారు. ఒకరి మనోభావాలను మరొకరు గౌరవించుకుంటూ, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పండుగలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించాలని కోరారు. ప్రతి పండుగను శాంతియుతంగా జరుపుకుంటున్నామని మైనారిటీ నాయకులు మీర్ మహేమూద్ అలీ అన్నారు. పరిగి పట్టణంలో ఇప్పటివరకు అన్ని పండుగలను ప్రజలు సోదరభావంతో కలిసి జరుపుకున్నారని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే ఐక్యత, పరస్పర గౌరవంతో ప్రతి పండుగను శాంతియుతంగా నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం మీర్ మహేమూద్ అలీ డీఎస్పీ శ్రీనివాస్, సీఐ కొండల్ రెడ్డి, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, నాయకులు మీర్ తాహేర్ అలీ, నయీమ్, మైనారిటీ మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.





# చిన్న కొమురయ్యకు ఘన నివాళులు

## (ప్రథమ వర్ధంతి సందర్భంగా స్మరణ సభ)

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మే 23 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)

హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం దేవన్నపేట గ్రామానికి చెందిన కాశబోయిన చిన్న కొమురయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా వర్ధన్నపేట నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ హాజరై ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తూ, కొమురయ్య సేవలను స్మరించుకున్నారు. గ్రామ అభివృద్ధికి, ప్రజా సేవకు ఆయన చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదని అన్నారు. చిన్న కొమురయ్య లేని లోటు గ్రామానికి తీరనిదని భావోద్వేగానికి గురయ్యారు.

# ఫ్యూచర్ సిటీపై హరీష్ రావు వ్యాఖ్యలు సరికాదు

## జర్నలిస్టులకు ఇళ్లస్థలాల కేటాయింపును అడ్డుకుంటారా

### టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య

హైదరాబాద్, మే 23 నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి :-



ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టబోతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై మాజీ మంత్రి, బీఆర్ ఎస్ నేత హరీష్ రావు చేసిన వ్యాఖ్యలు సరి అయినవి కావని అభి వృద్ధి విషయంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూ జేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పేర్కొన్నారు. రాబోయే ప్రభుత్వం బీఆర్ ఎస్ అనీ, తాము అధికారం లోకి రాగానే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని మాజీ మంత్రి హరీష్ రావు అనడం పట్ల ఆయన తీవ్ర అభ్యం తరం వ్యక్తం చేస్తూ, హరీష్ రావు వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు కేటాయించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాన్ని తాము స్వాగతిస్తున్నామని, అయితే ఈ ప్రయత్నాన్ని అడ్డుకోవడం కోసమే హరీష్ రావు కుట్రపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్టులకు గత పదేళ్ళలో టీఆర్ ఎస్, బీఆర్ ఎస్ ప్రభుత్వం చేయలేని పని కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్నారని మామిడి సోమయ్య అన్నారు. జర్నలిస్టులకు,సివిల్ సర్వీసెస్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫ్యూచర్ సిటీలో 500 ఎకరాల భూమి కేటాయిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించిన ప్రస్తుత సమయంలో మాజీ మంత్రి హరీష్ రావు ఈ విధమైన వ్యాఖ్యలు చేయడం పాత్రికేయుల్లో ఆవేదన,ఆందోళన వ్యక్తమవుతుందని ఆయన పేర్కొన్నారు. తమ రాజకీయ కక్షలు, స్వార్థ ప్రయోజనాల కోసం ప్రతిపక్ష నేతలు ప్రజల అభివృద్ధిని, సంక్షేమ కార్యక్రమాలను అడ్డుకోవడం సరైంది కాదని, జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు కేటాయించబోయే ఫ్యూచర్ సిటీకి అడ్డుపడడం బీఆర్ ఎస్ పార్టీ చేయబోయే పెద్ద తప్పిదమని అన్నారు. తొమ్మిదిన్నరేళ్ళు అధికారంలో ఉండి జర్నలిస్టులకు ఏమీ చేయని ప్రతిపక్ష బీఆర్ ఎస్ నాయకులు జర్నలిస్టుల సంక్షేమానికి అడ్డురావడం సరైంది కాదని అన్నారు.

# రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జన్మదినోత్సవమున ఘనంగా కేక్ కటింగ్...

## రోగులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేసిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్.

నకిరేకల్ నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి మే 23.




రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రజల పక్షాన ప్రజల కోసం నిత్యం ప్రజా సంక్షేమం కోసం పరితపించే వ్యక్తి నల్లగొండ జిల్లాకే టైగర్ అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ గుర్తు చేశారు. శనివారం తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు ఘ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి జన్మదిన సందర్భంగా నకిరేకల్ వ్యాప్తంగా జన్మదిన వేడుకలు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ ఆధ్వర్యంలో నకిరేకల్ కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిలో కేక్ కట్ చేసి రోగులకు బ్రెడ్ పండ్లు పంపిణీ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నాడు తెలంగాణ రాష్ట్రం కోసం మంత్రి పదవికి రాజీనామా చేసి ప్రజల పక్షాన ప్రజల కోసం ప్రజా జీవితం లో నిత్యం పరితపిస్తున్న శక్తి అని దైద రవీందర్ కొనియాడారు. ప్రజా నాయకుడిగా నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆ దేవుడు ఆయన కావాల్సిన ఆరోగ్యాన్ని శక్తిని అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గార్లపాటి రవీందర్ రెడ్డి నకిరేకల్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోట పుల్లయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి చింతల శ్రీనివాస్ యాదవ్ యూత్ కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# గంజాయి, మత్తు పదార్థాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు

## మందమర్రి, జైపూర్ లో డాగ్ స్క్వాడ్ తో ఆకస్మిక తనిఖీలు





మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 23 (నేషనలిస్ట్ వాయిస్):

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో గంజాయి, మత్తుపదార్థాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని మందమర్రి, జైపూర్ సిఐ లు పర్సా రమేష్, నవీన్ కుమార్ లు తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని మందమర్రి, జైపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం మంచిర్యాల యాంటీ నార్కోటిక్ టీం సహాయంతో నార్కోటిక్ స్నీఫర్ డాగ్ సహకారంతో మందమర్రిలో పట్టణ ఎస్ఐ గోపతి నరేష్, జైపూర్ లో ఎస్ఐ లింగంపల్లి భూమేష్ ల ఆధ్వర్యంలో మందమర్రి, జైపూర్ పోలీస్ స్టేషన్ ల పరిధిలోని పలు ప్రాంతాల్లో వేరువేరుగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలోని హోటల్లు, పాన్ షాపులు, అనుమాన ప్రదర్శనలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిఐ పర్సా రమేష్, నవీన్ కుమార్ లు మాట్లాడుతూ, ఎవరైనా గంజాయి, మత్తు పదార్థాలు, చిన్నపిల్లలకు మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్లు, గుట్కా, సిగరెట్లు వంటి నిషేధ వస్తువులు విక్రయించిన పక్షంలో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. యువత మత్తు పదార్థాలు బానిస కాకుండా తమ భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తారని స్పష్టం చేశారు. గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణతో పాటు యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటమే లక్ష్యంగా ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యాంటీ నార్కోటిక్ వింగ్ సిబ్బంది, మందమర్రి, జైపూర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# దైనందిన జీవితంలో వ్యాయామానికి కొంత సమయం కేటాయించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య





మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 23 (నేషనలిస్ట్ వాయిస్):

ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో కొంత సమయం వ్యాయామం, యోగ కు కేటాయించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య తెలిపారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యువజన క్రీడా ముగింపు కార్యక్రమానికి జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి హనుమంతరెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ రమేష్, ఇతర అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ పి చంద్రయ్య మాట్లాడుతూ, ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మే 18వ తేదీ నుండి 23వ తేదీ వరకు జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. 18వ తేదీన ఫిట్ అండ్ యాక్టివ్ తెలంగాణ, మారథాన్ - ఫిజికల్ లిటరసీ, 19వ తేదీన కెరీర్ అండ్ స్కిల్ డెవలప్మెంట్ - ఎం పవర్ స్కిల్స్, ఎం పవర్ ఫ్యూచర్, 20వ తేదీన యూత్ లీడర్ షిప్ సమ్మిట్, 21వ తేదీన ప్లే అండ్ పార్టిసిపేట్ - స్పోర్ట్స్ డే, 22వ తేదీన సర్వ్ అండ్ సపోర్ట్ - యూత్ ఫర్ క్లీన్ తెలంగాణ, 23వ తేదీన ఉద్యోగ సాధన - కనెక్టింగ్ టాలెంట్ విత్ ఆపర్చునిటీస్ వంటి కార్యక్రమాలను అధికారుల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా చేపట్టిన కార్యక్రమాలలో వివిధ జిల్లా శాఖల అధికారులు, క్రీడాకారులు, యువత, విద్యార్థులు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారని తెలిపారు. ప్రజల ఆరోగ్యకర జీవనశైలి, యువతకు ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించడం, మాదకద్రవ్యాల నియంత్రణ, నైపుణ్యాభివృద్ధి, ప్లాస్టిక్ రహిత సమాజం తదితర అంశాలపై చర్చలు, చిత్రలేఖన పోటీలు, సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికల అందజేత, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక కార్యక్రమాలు, స్పోర్ట్స్ డే వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని జిల్లాలో అన్ని విభాగాలలో విజయవంతం చేసేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. అనంతరం చిత్రలేఖనం, క్రీడ పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు వంటి అంశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, యువతి యువకులు, విద్యార్థులు, యువజన సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# చేరుకూరు నుండి ధర్మవరం రోడ్డు నిర్మాణం చేపట్టాలి

## -అటవీశాఖ అడ్డంకులు నిలియవేయాలి-రోడ్డు నిర్మాణం చేపట్టేవరకు సిపిఎం ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళన

## -సిపిఎం మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు.

వాజేడు ( నేషనలిస్ట్ వాయిస్ రిపోర్టర్) మే 23



వాజేడు మండల పరిధిలో శనివారం సిపిఎం ఆధ్వర్యంలో చేరుకూరు నుండి ధర్మవరం వెళ్లే రోడ్డు ను సందర్శించి నిరసన తెలపటం జరిగింది, ధర్మవరం నుండి చేరుకూరు రోడ్డు గుంతలతో ప్రజా రవాణాకు ఆటంకం గా ఉందని, రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం ముందుకు వచ్చిన అటవీశాఖ అభ్యంతరం తెలిపి రోడ్డు నిర్మాణం చేయకుంట అడ్డుకుంటుందని సిపిఎం మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు మాట్లాడుతూ అన్నారు ప్రభుత్వం ఇసుక లారీలకు అనుమతి ఇచ్చి వేలాది లారీలు ఈ రోడ్డు నుండి వెళ్ళటం వలన పూర్తి గా ధ్వంసం ఐ గుంతలు ఏర్పడి వాహనాలు వెళ్లాలంటే నరకయాతన పడాల్సి వస్తుందని అత్యవసర సమయం లో అంబులెన్స్ వెళ్లాలన్న వెళ్లలేని పరిస్థితి ఉందని వారు అన్నారు, ఇరుకు రోడ్డు అవటం పక్కకు వెళ్లేందుకు దారి లేకపోవటం రోడ్డు గుంతలు అవటం వలన అనేక మంది ప్రమాదాల బారిన పడ్డారని వారు అన్నారు, అనేక ఆందోళన పోరాటాల వలన ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి ముందుకు వచ్చిన అటవీశాక అనుమతులు లేక రోడ్డు నిర్మాణం ఆగిపోయిందని గ్రామాల మధ్యలో అటవీ భూమి ఉండటం వలన చిన్న చిన్న అభివృద్ధి పనులకు అటవీశాక ఆటంకాలు తెలుపుతుందని ఇది సరైంది కాదని కర్రే గుట్టలలాంటి చోట రోడ్డు నిర్మాణానికి అనుమతులు ఇచ్చే అటవీ శాఖ ప్రజా అవసరాల కోసం ఎందుకు ఇవ్వటం లేదని ప్రజల కంటే ప్రభుత్వ నికి బడా కార్పొరేట్ శక్తులే ముక్యం అని వారు అన్నారు ఇకనైనా ప్రభుత్వశీ అటవీశాఖ అధికారుల తో మాట్లాడి రోడ్డు నిర్మాణం చేపట్టక పోతే సిపిఎం ఆధ్వర్యంలో దశల వారి పోరాటానికి పునుకుంటాం అని వారు మాట్లాడుతూ అన్నారు.. ఈ కార్యక్రమం లో సిపిఎం నాయకులు గార సద్రకిన్, గౌరారపు చంద్రశేఖర్, బలుసుపాటి నరేష్, మహేందర్, అల్లి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు

# వడదెబ్బతో వ్యక్తి మృతి

గండీడ్ ( నేషనలిస్ట్ వాయిస్ రిపోర్టర్ ) మే 23



తెలంగాణలో ఎండలు రోజురోజుకీ మరింత తీవ్రరూపం దాల్చుతున్నాయి. మహబూబ్ నగర్ జిల్లా, గండీడ్ మండలం, కప్లాపూర్ గ్రామానికి చెందిన సైదనోళ్ల సాయన్న వడదెబ్బతో మృతి చెందారు. గత వారం రోజులు పొలం పనులు చేసిన సాయన్న వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురై, ఆసుపత్రికి చేరేలోపు మృతి చెందాడు. తెలంగాణ రాష్ట్రంలో గత నాలుగు రోజులుగా పెరిగిన ఎండల తీవ్రతతో మహబూబ్ నగర్ జిల్లాలో కూడా తీవ్ర ఆందోళన మొదలైంది. రైతులకు ఎండ తీవ్రతపై అధికారులు పలు సూచనలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# మొక్కజొన్న నిల్వలు వెంటనే గోదాములకు తరలించాలి

## -ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు అందుబాటులో ఉండాలి-జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మే23(నేషనలిస్ట్ వాయిస్):**

మొక్కజొన్న నిల్వలు వెంటనే గోదాములకు తరలించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ఆళ్లపల్లి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న మొక్కజొన్న కొనుగోలు నిల్వ లోడింగ్ రవాణా ప్రక్రియలను పరిశీలించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో ప్రస్తుతం 117 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న నిల్వ ఉన్నదని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మొక్కజొన్న నిల్వలు ఎక్కువకాలం కొనుగోలు కేంద్రంలో ఉండకుండా వెంటనే గోదాములకు తరలించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులు తీసుకొస్తున్న మొక్కజొన్నను సకాలంలో కొనుగోలు చేసి వేగవంతంగా లోడింగ్ పూర్తి చేయాలని సూచించారు.ముఖ్యంగా రవాణా వాహనాలు, హమాలీల లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. లారీల కొరత లేదా హమాలీల సమస్యల కారణంగా తరలింపు ప్రక్రియలో జాప్యం జరగకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అధికారులకు సూచించారు. రవాణా శాఖ అధికారులను అడిగి లారీల అందుబాటు లోడింగ్ పనుల పురోగతి రోజువారీ తరలింపు సామర్థ్యం తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. అవసరమైతే అదనపు వాహనాలు సమకూర్చి మొక్కజొన్న నిల్వలను వేగవంతంగా తరలించాలని ఆదేశించారు.అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని నిల్వ ఉన్న మొక్కజొన్న తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. రైతులకు తాగునీరు నీడ కూర్చునే సదుపాయాలు కల్పించాలని కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి రైతులకు సంబంధించిన చెల్లింపులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.అనంతరం ఆళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో సిబ్బంది హాజరు శాతం వైద్య సేవల నిర్వహణ రోగులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు.తనిఖీల సందర్భంగా మెడికల్ అధికారి తరుణ్ అందుబాటులో లేకపోవడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. విధుల్లో ఎందుకు లేరని సిబ్బందిని ప్రశ్నించి వివరణ కోరారు. సంబంధిత శాఖ అధికారులను దీనిపై పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అనంతరం సిబ్బంది హాజరు పట్టికలు రిజిస్టర్‌లను పరిశీలించి ప్రతి ఉద్యోగి విధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గైర్హాజరైన సిబ్బంది సెలవుల వివరాలు, డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న వారి సమాచారం తదితర అంశాలపై సమగ్ర వివరాలు తెలుసుకున్నారు. అవుట్ పేషెంట్ విభాగం పరీక్షల గది మందుల నిల్వ గది ఇన్ పేషెంట్ విభాగాలను పరిశీలించిన కలెక్టర్ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వడదెబ్బతో చికిత్స పొందుతున్న రోగులను ప్రత్యేకంగా పరామర్శించి వారికి అందుతున్న వైద్య సదుపాయాలు మందులు పర్యవేక్షణపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో వడదెబ్బ తగిలిన వారికి ఎప్పటికప్పుడు అందుబాటులో వైద్య సేవలు ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన మందులు ఐవీ ఫ్లూయిడ్స్ పడకలు అందుబాటులో ఉంచి అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని సూచించారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు



కలగకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు సిబ్బంది తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ ఉషారాణి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మద్యం పట్టివేత

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 23 (నేషనలిస్ట్ వాయిస్):**

జిల్లాలోని జైపూర్ మండలం గోపాల్ పూర్ గ్రామంలో శుక్రవారం ఏ విధమైన లైసెన్స్ లేకుండా మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్న ఇంటిని సోదా చేసి, అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగిందని మంచిర్యాల ఎక్సైజ్ సిఐ గురువయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశ్వసనీయ సమాచారం మేరకు గోపాల్ పూర్ గ్రామంలో తాళ్లపల్లి రమేష్ గౌడ్ ఇంటిని సోదా చేసి ఆ వ్యక్తి వద్ద నుండి 46 (180ఎంఎల్) మద్యం బాటిల్లు, 12 (650ఎంఎల్) బీర్ బాటిల్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని, పట్టుబడిన మద్యం విలువ సుమారుగా 12 వేల రూపాయల వరకు ఉంటుందని తెలిపారు. అనంతరం రమేష్ గౌడ్ పై ఎక్సైజ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి, అనంతరం అతనిని జైపూర్ మండల తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేయడం జరిగిందన్నారు.




# ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యాఖ్యలను వక్రీకరించారు

## -అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్

**భద్రాద్రి కొత్తగూడెం,మే23(నేషనలిస్ట్ వాయిస్):**




ఇటీవల ఒక సోషల్ మీడియా ఇంటర్వ్యూలో రాజకీయ విశ్లేషకుడు సామాజిక సేవకుడు అందరివాడు అయిన మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యాఖ్యానించిన కొన్ని వ్యాఖ్య లను సోషల్ మీడియాకు చెందిన కొందరు వక్రీకరించి నెగటివ్ గా చిత్రీక రించడం జరిగిందని దానికి జనసేన సైనికులు అపార్థం చేసుకుని ప్రొఫెసర్ నాగేశ్వర్ ని తీవ్రంగా విమర్శిస్తూ పోలీస్ స్టేషన్లో కూడా కేసులు పెట్టడం సమంజసం కాదని భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు సమాజసేవకులు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన శనివారం ప్రకటన విడుదల చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ పై పెట్టిన పోలీస్ కేసులను వెంటనే ఉపసంహరించు కోవాలని లేకపోతే ఇది ప్రజాస్వామ్య పరిరక్షణకే గొడ్డలి పెట్టు అవుతుందని పేర్కొన్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ మీద కేసులను పెట్టడం సమంజసం కాదంటూ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అపరబాలు అల్లి శంకర్, భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర మైనారిటీ అధ్యక్షులు శ్రీ నయీమ్ ఖురేషి, టిఎంఆర్పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుండా రమేష్, ఎల్ హెచ్ పి ఎస్ నాయకులు లావుడియా సత్యనారాయణ, లాల్ సింగ్ నాయక్, న్యాయవాది బానోత్ రమేష్ నాయక్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు పి.సురేందర్, మాల మహానాడు జిల్లా నాయకులు సుంద్రు రఘునాథ్ బాబు, శనగ లక్ష్మణ్, టిఎంఆర్పిఎస్ జిల్లా నాయకులు బొమ్మెర అశోక్, పృథ్వీరాజ్, అంబేద్కర్ సంఘ నాయకులు నరేందర్, రాజేశ్వర్, మాల మహానాడు రాష్ట్ర మహిళ నాయకురాళ్లు బడికెల పుష్పలత, కొదురుపాక మీనాక్షి, కుంచే లావణ్య, జోగు రమాదేవి, మాధవిలత తదితరులు ఖండించారు.

# ధాన్యం నిల్వ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 23 (నేషనలిస్ట్ వాయిస్):**

కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం తరలింపు, నిల్వ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శనివారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదామును బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ మండల తహశీల్దార్ కృష్ణ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం దెబ్బతినకుండా కేటాయించిన ప్రకారం గోదాములు, రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో గోదాములకు వచ్చే ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకొని నిబంధనల ప్రకారం నిల్వ చేయాలని తెలిపారు. రైస్ మిల్లర్లు తమకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం బెల్లంపల్లి మండల కేంద్రంలో గల సింగరేణి క్లబ్, బూదకలాన్ గ్రామంలో గల సింగరేణి క్లబ్ లను సందర్శించి ధాన్యం నిల్వకు గల అవకాశాలను పరిశీలించారు. సింగరేణి క్లబ్ లలో ధాన్యం నిల్వ చేసేందుకు అవసరమైన అనుమతులు పొందాలని అధికారులకు సూచించారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలో గల కమ్యూనిటీ హాల్ ను కాసిపేట మండల తహశీల్దార్ సునీల్ దేశ్ పాండే తో కలిసి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో గల సమత రైస్ మిల్లును మండల తహశీల్దార్ సదానందం తో కలిసి పరిశీలించి ధాన్యం దిగుమతి వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల నుండి తరలించిన ధాన్యం దిగుమతి వేగంగా చేసుకోవాలని, అవసరమైన మేరకు హమాలీల సంఖ్య పెంపొందించుకోవాలని తెలిపారు. రైస్ మిల్లులకు నిర్దేశించిన సిఎంఆర్ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దశివునూర్ లో కొనసాగుతున్న జనగణన

**చేగుంట మే 23(నేషనలిస్ట్ వాయిస్ రిపోర్టర్ )**

లిమెదక్ జిల్లా చేగుంట మండలం పెద్దశివునూర్ గ్రామంలో మొదటి విడత జనగణన దిగ్విజయంగా కొనసాగుతుంది. స్థానిక ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు సంతోషి ఎన్యుమరేటర్లుగా ప్రతిరోజు ఉదయాన్నే గ్రామాన్ని చుట్టేస్తున్నారు. గ్రామ ప్రజల సహకారంతో ఇప్పటికే 70%పైగా జనగనన పూర్తి చేసామని ఉపాధ్యాయులు చెబుతున్నారు.ఆరంభం నుండి కొన్ని ఇండ్లకు తాళాలు వేసి ఉండటంతో కొంత ఇబ్బంది ఎదురవుతున్నందున ప్రజలు కొన్ని రోజులు ఇంటివద్ద ఎవరినైనా ఉంచినట్లుయితే త్వరగా పూర్తి చేయడానికి వీలుపడుతుందని తెలియజేసారు. కాగా వచ్చే నెల అనగా జూన్ 9వరకు జనగనన కొనసాగనుంది.

ఈ కార్యక్రమంలో చేగుంట మండల మార్కెట్ కమిటీ డైరెక్టర్ అన్నం ఆంజనేయులు గ్రామస్తులు. అప్పల ప్రశాంత్ అన్నం శ్రీనివాస్ ఎర్ర ఎల్లయ్య అప్పల శంకర్ అన్నం సిద్ధ రాములు అన్నం యాదగిరి మల్లయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారులి



# విఓఏలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

## – మంత్రి సీతక్కపై బి ఆర్ఎస్ నేత రాజిరెడ్డి విమర్శలు







**దోమ నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి మే 23**

దోమ మండల కేంద్రంలో విఓఏలకు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి సీతక్క ఎందుకు అమలు చేయడం లేదని దోమ మండల బీఆరెస్ నేత కె. రాజిరెడ్డి ప్రశ్నించారు. శనివారం దోమ ఐకేపీ కార్యాలయం ముందు వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత కోసం గత ఆరు రోజులుగా నిరసన చేపడుతున్న విఓఏలకు బి ఆర్ఎస్ పార్టీ తరపున మండల పార్టీ అధ్యక్షుడు గోపాల్ గౌడ్, వార్డ్ సభ్యులు మైను శ్రీనివాస్ రెడ్డి, చాకలి వెంకటయ్య, శివ భాస్కర్ రెడ్డిలతో కలిసి ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ.. మహిళా సంఘాల సభ్యులను ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లడంలో, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను గ్రామస్థాయిలో ప్రజలకు చేరవేయడంలో విఓఏలు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు విఓఏల జీతాలను రూ.26 వేల వరకు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని సభల్లో హామీ ఇచ్చిన సీతక్క.. ప్రస్తుతం అదే శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు గడుస్తున్నా వారి సమస్యలను పట్టించుకోకపోవడం బాధాకరమని విమర్శించారు. విఓఏలకు తక్షణమే వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత కల్పించి, పనిభారం తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామీణ మహిళల అభివృద్ధికి, స్వయం సహాయక సంఘాల బలోపేతానికి విఓఏలు చేస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. ఈ సందర్భంగా విఓఏ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. తాము కష్టపడి పనిచేస్తున్నప్పటికీ తమ సేవలకు తగిన గుర్తింపు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము చేసిన పనులకు ఇతర శాఖల ఉద్యోగులు క్రెడిట్ తీసుకుంటున్నారని ఆరోపించారు. తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

# ఎఐతో నకిలీ బికినీ ఫోటలు నెట్టింట వైరల్ కావడంపై నటి రుక్మిణీ ఆగ్రహం



'సప్త సాగరాలు దాటి' సినిమాతో తెలుగు ప్రేక్షకులలో మంచి గుర్తింపు తెచ్చుకున్న కన్నడ నటి రుక్మిణి వసంత్‌కు సంబంధించిన కొన్ని బికినీ ఫోటోషూట్ క్లిప్స్ సోషల్ మీడియాలో విపరీతంగా కనిపించడంపై న టి రుక్మిణీ వసంత్ ఆగ్రహం చెందారు. గ్రీన్ కలర్ బికినీ ధరించి ఆమె స్విమ్మింగ్ పూల్‌లోకి దిగుతున్నట్లు ఉన్న ఈ విజువల్స్ నెటిజన్లను ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురిచేశాయి. చుట్టూ కెమెరాలు, టెక్నీషియన్లు ఉండటంతో ఇది ఏదైనా అధికారిక షూట్ అయ్యి ఉంటుందని కొందరు భావించగా, మరికొందరు మాత్రం ఇది ఏఐ డీప్‌ఫేక్ అయ్యి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తంచేశారు. అయితే ఈ వివాదంపై తాజాగా నటి రుక్మిణి వసంత్ అధికారికంగా స్పందిస్తూ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్నెట్‌లో తన పేరిట సర్క్యులేట్ అవుతున్న బికినీ చిత్రాలన్నీ పూర్తిగా ఎఐ ద్వారా సృష్టించిన నకిలీ ఫోటోలని ఆమె స్పష్టం చేశారు. ఆ చిత్రాలు పూర్తిగా తప్పుడు సమాచారంతో, కల్పితంగా సృష్టించబడినవని ఆమె పేర్కొన్నారు. బాధ్యతా రాహిత్యంగా ఇతరుల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తూ ఇటువంటి మార్ఫింగ్ కంటెంట్‌ను తయారు చేయడం మరియు వాటిని వైరల్ చేయడం తీవ్రమైన నేరమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారాన్ని తన టీమ్ చాలా తీవ్రంగా పరిగణిస్తోందని, ఈ ఫోటోలను సృష్టించిన వారిపై, అలాగే వీటిని సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ప్రచారం కల్పిస్తున్న వారిపై సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేసి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబోతున్నట్లు రుక్మిణి వెల్లడించారు. నెటిజన్లు ఎవరూ కూడా ఇటువంటి నకిలీ కంటెంట్‌ను ఇతరులకు షేర్ చేయవద్దని, వాటిని ప్రోత్సహించవద్దని ఆమె ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# పెద్ది విజయంపైనే రామ్‌చరణ్ ఆశలు బుచ్చిబాబు దర్శకత్వానికి కూడా సవాలే

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్.... ఆర్‌ఆర్‌ఆర్ తర్వాత గ్లోబల్ స్టార్‌గా ఎదిగిన ఆయనకు అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించింది. అయితే ఆ తరువాత వచ్చిన సినిమాలు మాత్రం ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేకపోయాయి. దీంతో ఇప్పుడు చరణ్ కెరీర్‌లో రాబోయే రెండు ప్రాజెక్టులు అత్యంత కీలకంగా మారాయి. ఆచార్యలో కీలక పాత్ర పోషించినప్పటికీ ఆ చిత్రం ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. అనంతరం భారీ అంచనాల మధ్య విడుదలైన గేమ్ ఛేంజర్ కూడా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయింది. స్టార్ దర్శకుడు, భారీ బ్జడెట్, భారీ తారాగణం ఉన్నప్పటికీ సినిమా ప్రేక్షకుల అంచనాలను పూర్తిగా అందుకోలేకపోయింది. దీంతో ఇప్పుడు అభిమానుల ఆశలన్నీ చరణ్ తదుపరి చిత్రం 'పెద్ది'పై నిలిచాయి. దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కిస్తున్న ఈ చిత్రం గ్రామీణ నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, గ్లింప్స్, పాటలు, టీజర్‌లకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ముఖ్యంగా చరణ్ మాస్ లుక్, రగ్గడ్ బాడీ లాంగ్వేజ్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. చాలా కాలం తర్వాత ఆయనను పూర్తి స్థాయి మాస్ పాత్రలో చూడబోతున్నామనే అంచనాలు అభిమానుల్లో కనిపిస్తున్నాయి. బుచ్చిబాబు తన తొలి చిత్రం ఉప్పెన తోనే దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. భావోద్వేగాలను బలంగా తెరపై చూపించడంలో ఆయన ప్రత్యేక శైలి ఉందని సినీ విశ్లేషకులు చెబుతుంటారు. అదే ఎమోషనల్ టచ్ 'పెద్ది'లో కూడా కనిపించనుందనే టాక్ వినిపిస్తోంది. ఇక 'పెద్ది' తర్వాత చరణ్ చేయబోయే సినిమా మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఎందుకంటే ఆ చిత్రానికి దర్శకత్వం వహించబోయేది సుకుమార్. ఇప్పటికే వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన రంగస్థలం ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. ముఖ్యంగా చిట్టిబాబు పాత్రలో చరణ్ నటనకు భారీ ప్రశంసలు వచ్చాయి. ఆ సినిమా ఆయన కెరీర్‌లో కీలక మలుపుగా నిలిచింది. ఇప్పుడు మరోసారి అదే కాంబినేషన్ రిపీట్ అవుతుండటంతో అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి. ఒకవేళ 'పెద్ది' భారీ విజయాన్ని అందుకుంటే ఆయన మాస్ ఇమేజ్ మరింత బలపడే అవకాశం ఉంది. ఆ తర్వాత సుకుమార్ సినిమా కూడా విజయవంతమైతే గ్లోబల్ స్టార్‌గా ఆయన మార్కెట్ మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి.








# అఖిల్ లెనిన్ టీజర్ విడుదల అక్కినేని అభిమానుల్లో ఉత్సాహం

అక్కినేని అఖిల్ హీరోగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'లెనిన్'పై ప్రేక్షకుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. యువ దర్శకుడు మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే సినిమా అనౌన్స్‌మెంట్‌తో మంచి అంచనాలు ఏర్పడగా, తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై మరింత హైప్ తీసుకొచ్చింది. ఈ సినిమా జూన్ 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. మరోవైపు అక్కినేని నాగార్జున సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టి 40 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రత్యేక సందర్భంగా, 'లెనిన్' టీజర్‌ను విడుదల చేయడం అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. విడుదలైన టీజర్‌లో అఖిల్ స్టైలిష్ లుక్‌తో పాటు మాస్ ఎలిమెంట్స్ కూడా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆయన చెప్పిన డైలాగులు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. మనోడు వస్తున్నాడు? నేను తప్పిపోయి రాలేదు.. మీ అందరినీ వెతుక్కుంటూ వచ్చా? అంటూ అఖిల్ చెప్పిన డైలాగులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. ఈ డైలాగుల్లో కనిపించిన యాటిట్యూడ్, స్క్రీన్ ప్రెజెన్స్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక టీజర్ విడుదలపై నాగార్జున కూడా స్పందించారు. తనకు ఈ టీజర్ ఒక సర్‌ప్రైజ్‌లా అనిపించిందని ఆయన పేర్కొన్నారు. టీజర్ మొత్తం ఎంతో హాయిగా, ఆకట్టుకునేలా అనిపించిందని అభిప్రాయపడ్డారు. మంచి కమ్‌బ్యాక్ కోసం ఎదురుచూస్తున్న ఆయనకు 'లెనిన్' మంచి మైలురాయిగా మారుతుందా అనే ఆసక్తి అభిమానుల్లో కనిపిస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ చూస్తుంటే సినిమాలో యాక్షన్, భావోద్వేగాలు, మాస్ అంశాలు సమపాళ్లలో ఉండబో తున్నట్లు సంకేతాలు కనిపిస్తు న్నాయి. దీంతో జూన్ 26న విడుదల కానున్న ఈ సినిమాపై అక్కినేని అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.






# 200 కోట్లు రాబట్టిన కరుప్ప

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, స్టార్ హీరోయిన్ త్రిష జంటగా నటించిన తాజా చిత్రం 'కరుప్పు' తెలుగులో 'వీరభద్రుడు' బాక్సాఫీస్ వద్ద విజయపరంపర కొనసాగిస్తోంది. విడుదలైన కొద్ది రోజులకే ఈ సినిమా భారీ వసూళ్లు నమోదు చేస్తూ కొత్త రికార్డులను సృష్టిస్తోంది. ప్రేక్షకుల నుంచి వస్తున్న విశేష స్పందనతో ఈ చిత్రం తమిళ చిత్ర పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది. విడుదలైన వారం రోజుల్లోనే 'కరుప్పు' ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్ల క్లబ్‌లో చేరి సంచలనం సృష్టించింది. ముఖ్యంగా తమిళనాడులో ఈ సినిమా సాధించిన వసూళ్లు ఇప్పుడు సినీ వర్గాల్లో ప్రత్యేక చర్చకు కారణమయ్యాయి. గత తొమ్మిది నెలలుగా తమిళనాడులో ఏ సినిమా అందుకోలేని అరుదైన ఘనతను 'కరుప్పు' సాధించింది. కేవలం తమిళనాడు రాష్ట్రంలోనే రూ.100 కోట్ల మార్క్‌ను దాటిన చిత్రంగా నిలిచింది. ఈ చిత్రాన్ని పంపిణీ చేసిన డిస్ట్రిబ్యూషన్ వర్గాలు కూడా ఈ విజయంపై ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు నమోదు చేసినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ కలెక్షన్లలో ప్రధానంగా తమిళ వెర్షన్ నుంచే అధిక ఆదాయం




# నాగార్జునకు మే 23 స్పెషల్ తొలి చిత్రం విక్రమ్ విడుదలై 23 ఏళ్లు

తన జీవితంలో 'మే 23' ఎప్పటికీ ప్రత్యేకమేనని అగ్ర కథానాయకుడు నాగార్జున అన్నారు. అందులోనూ ఈ ఏడాది మరీ స్పెషల్ అని తెలిపారు. తన మొదటి చిత్రం 'విక్రమ్' విడుదలై నేటికి 40 ఏళ్లు అయిన సందర్భంగా ఆయన పోస్ట్ పెట్టారు. తనను ఆదరిస్తున్న అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. అందరికీ ధన్యవాదాలు. మే 23.. నేను ఎప్పటికీ మర్చిపోలేని రోజు.. మా నాన్న చివరి చిత్రం (మనం) 2014లో ఈరోజే విడుదలైంది. నాన్నతో పాటు నాగచైతన్య, అఖిల్‌లతో నటించే అవకాశం ఆ సినిమాతోనే దక్కింది. ఇక 40 ఏళ్ల క్రితం ఇదే రోజు నా మొదటి చిత్రం 'విక్రమ్' విడుదలైంది. మిమ్మల్ని అలరించడం కోసం, మీ ప్రేమాభిమానాలు పొందడం కోసం నేను ఇండస్ట్రీకి వచ్చాను. 'విక్రమ్' నాకు ఎంతోమంది అభిమానులను దగ్గర చేసింది. ఇన్నేళ్లుగా నాకు అండగా నిలిచిన అభిమానులందరికీ నా కృతజ్ఞతలు. భవిష్యత్తులో మరిన్ని మే 23లను ఇలానే సెలబ్రేట్ చేసుకోవాలని కోరుకుంటున్నా' అని నాగార్జున తన పోస్ట్‌లో పేర్కొన్నారు. నాగార్జున హీరోగా మధుసూధనరావు తెరకెక్కించిన చిత్రం 'విక్రమ్' 1986 మే 23న విడుదలై విజయాన్ని అందుకుంది. 1983లో బాలీవుడ్‌లో విడుదలైన 'హీరో' సినిమాకు రీమేక్‌గా రూపొందింది. ప్రస్తుతం కింగ్ తన 100వ సినిమాతో బిజీగా ఉన్నారు. తమిళ దర్శకుడు రా.కార్తీక్ తెరకెక్కిస్తున్నారు.

PRINTED AND PUBLISHED by VASISTA PRINTERS 18-97, 306, 3RD FLOOR, RAJINIGANDHA COMPLEX, KAMALA NAGAR, CHAITANYAPURI, SAROORNAGAR, RANGAREDDY, TELANGANA - 500060, RNI No :TGTEL/25/A4284 EDITOR KOMMU SRINIVAS, Contact - 9666023180 & 8096660656